thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 208 | జగిత్యాల బుధవారం 11 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

సెహ్వాగ్ విధ్వంసం.. సెమీస్‌కు భారత్!



11

శ్రీశైలం, నాగార్జునసాగర్ అసలు అనుమతుల వివరాలివ్వండి



- తెలంగాణ, ఏపీకి కృష్ణా బోర్డు లేఖలు
- ప్రాజెక్టుల రూపకల్పన, నీటి వినియోగంపై సమాచారం కోరిన బోర్డు
- అనుమతి లేని 13 భాగాలకు సంబంధించిన క్లియరెన్స్‌లు సమర్పించాలని ఆదేశం
- 2016 కేటాయింపులనే ప్రాథమిక ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టీకరణ
- తాగునీటి వాటాలపై ఇరు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదం

హైదరాబాద్, నవంబర్ 10:

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి మొదట మంజూరైన అనుమతులు, అసలు రూపకల్పన వివరాలను సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖలకు తాజాగా లేఖలు రాసింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల ప్రకారం.. తొలుత

మిగతా 3వ పేజీలో..



ప్రజల విశ్వాసమే పోలీసులకు అసలైన గౌరవం

పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత మీదే
సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడి నియామకాలు సాధించాం
పారదర్శకతతోనే పేదల పిల్లలకు కొలువులు
సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
అవసరమైతే మెరుగైన శిక్షణ కోసం విదేశాలకు పంపిస్తాం
నూతన డీఎస్పీల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 10 :

రాష్ట్రంలో అత్యంత సంక్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటూ నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు పూర్తి పారదర్శకతతో డీఎస్పీల ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ)లో నూతన ప్రొబేషనరీ డీఎస్పీల (DSP - 2025 సెకండ్ బ్యాచ్) ముఖాముఖి, ముగింపు వేడుకల సమావేశంలో పాల్గొన్నారు. 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది జాయిన్

మిగతా 2వ పేజీలో..



రాహుల్‌తో

మహేశ్ కుమార్ గౌడ్ భేటీ

- తెలంగాణ కాంగ్రెస్ కార్యక్రమాలపై చర్చ
- ఈ నెల 13 లేదా 14న హైదరాబాద్‌కు రాహుల్
- గిగ్ వర్కర్లు, ఓబీసీల ప్రాతినిధ్యంపై చర్చ
- నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

2



పాలమూరును పచ్చగా మార్చింది కేసీఆర్ పాలనే

- * కాంగ్రెస్ నిర్లక్ష్యంతో మూడు తరాలుగా పాలమూరుకు నష్టం
- * రూ.35 వేల కోట్లతో పాలమూరు–రంగారెడ్డి పనులు చేపట్టాం
- * ఎండిన పంటలకు పరిహారం ప్రకటించాలని డిమాండ్
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శలు

3

భారీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- రేపు ఆటోమొబైల్ అండ్ ఈవీ రంగం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం



2

భూ రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట

- భూ యజమానుల హక్కులు, సరిహద్దులకు ప్రాధాన్యం
- 2,720 గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే
- ఇప్పటివరకు 416 గ్రామాల్లో సర్వే పూర్తి

2





మహిళల భద్రతకు ఐటీ సంస్థలు సహకరించాలి: డీజీపీ

- సైబరాబాద్‌లో నూతన భరోసా కేంద్రం ప్రారంభం
- బాధితులకు ఒకే చోట వైద్యం, కౌన్సెలింగ్, న్యాయ సహాయం
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి 'సైబరాబాద్ మూవ్స్'
- నవంబర్ 26 నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక సమావేశాలు

2



'ఖేలో ఇండియా' ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

- దేశం గర్వించేలా పోటీల నిర్వహణకు ప్రణాళిక
- రూ.203 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి
- ఇప్పటికే 11 స్టేడియాలు సిద్ధం.. మరో ఐదింటిలో పనులు
- యువతను సోషల్ మీడియా, బెట్టింగ్ నుంచి క్రీడల వైపు మళ్లించాలి
- అధికారులకు మంత్రి వాకిటి శ్రీహరి సూచన

2

జనవరిలో అల్వాల్ టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం

- డిసెంబర్ నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి
- ప్రస్తుతం 95 శాతానికి పైగా సివిల్ పనులు పూర్తి
- 1,000 పడకలు, 28 ఆపరేషన్ థియేటర్లు



3

హైదరాబాద్, నవంబర్ 10 :

గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు జనవరి నుంచి అల్వాల్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సేవలు అందుబాటులోకి రానుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. డిసెంబర్ నెలాఖరు నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభిస్తామని ప్రకటించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎం. గణేష్, ఆర్అండ్‌బీ, వైద్యారోగ్య శాఖ అధికారులతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

మిగతా 2వ పేజీలో..

లోన్ యాప్ వేధింపులకు కానిస్టేబుల్ బలి



2

రాహుల్ పొలిటికల్ రీలాంచ్‌కు ఇది అడ్డా కాదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఫైర్



3

వాయు కాలుష్య నియంత్రణలో కేంద్రం విఫలం: ఖర్గే

- బీజేపీ పాలనలో ప్రచారానికే ప్రాధాన్యమని విమర్శ
- 36 కేంద్రాల్లో పీఎం 2.5 రీడింగ్స్ మాయం
- ఢిల్లీలో 2023లో కాలుష్యంతో 17,188 మంది మృతి



4

డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- సైబర్ మోసాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశం
- రక్షణ ప్రణాళికను సమర్పించాలని వాట్సాప్‌కు సూచన



4

తాత ఆస్తిలో మనవళ్లకు పుట్టుకతోనే హక్కు ఉండదు

- తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై ఆయనకే పూర్తి అధికారం
- ఆస్తి విక్రయాన్ని అడ్డుకోలేరని స్పష్టీకరణ
- హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం పంపకాలు

4

రైతులకు బ్యాంకులు అండగా నిలవాలి



- పంట రుణాల రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్‌కు చర్యలు
- రబీకి రూ.38,268 కోట్ల రుణాలు వెంటనే ఇవ్వాలి
- కౌలు, చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం
- ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధికి రుణాలు
- మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబర్ 10:

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క కోరారు. అర్హులైన రైతుల పంట రుణాలను ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేయడంతోపాటు రబీకి కొత్త రుణాలను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని, వీటిలో 111 మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు రుణ ఉపశమనం కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సేద్యం, పంటల నిల్వ, ప్రాసెసింగ్‌కు రుణాలు అందించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశాలను పరిశీలించాలని, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. విద్యా, గృహ రుణాలతోపాటు ఎంఎస్‌ఎంఈ రంగానికి రుణాలు పెంచాలన్నారు. రైతులను ఆదుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కృష్ణా, గోదావరి నదులకు వరదలు రాకపోవడంతో జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయని, సుమారు 10 నుంచి 15 లక్షల బోరుబావుల్లో నీరు అందని పరిస్థితి ఉందని తెలిపారు. రబీ సీజన్‌కు నిర్దేశించిన రూ.38,268 కోట్ల పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. 2026 సెప్టెంబర్ నాటికి రూ.96,943 కోట్ల రుణ పంపిణీ లక్ష్యంలో 53 శాతమే సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగుతోపాటు డ్రిప్, స్ప్రింక్లర్ సేద్యానికి రుణాలు అందించాలని తుమ్మల కోరారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, పాడి, పౌల్ట్రీ, పశుపోషణ, తేనెటీగల పెంపకం వంటి అనుబంధ రంగాలకు ఆర్థిక సహకారం అందించాలని సూచించారు. రైతులు తిరిగి ఆదాయం పొందే వరకు వడ్డీ భారం పడకుండా రుణాల రీషెడ్యూలింగ్ చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇతర ఉన్నతాధికారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- నేడు ఆటోమొబైల్ అండ్ ఈవీ రంగం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం
- 25మంది పారిశ్రామిక వేత్తలు, కంపెనీల ప్రతినిధులతో హైబ్రిడ్ విధానంలో..

హైదరాబాద్, నవంబర్ 10 : రాష్ట్రాన్ని ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) రంగాల్లో దేశంలోనే ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతోపాటు రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 సన్నాహాల్లో భాగంగా ఆటోమొబైల్ అండ్ ఈవీ రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం ఉదయం సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరగనుంది. హైబ్రిడ్ విధానంలో (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) నిర్వహించనున్న ఈ సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆటోమొబైల్, ఈవీ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు, పరిశ్రమల నిపుణులు, కీలక భాగస్వాములను ఈ కౌన్సిల్‌లో భాగస్వాములయ్యేందుకు సంప్రదించగా సుమారు 25మంది తమ అంగీకారం తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం ఆటోమొబైల్, ఈవీ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో నేరుగా చర్చించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆయా సంస్థలకు ఉన్న ఆసక్తి, పెట్టుబడి ప్రతిపాదనలు, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు, పరిశ్రమల విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్తులో అందుబాటులో ఉన్న అభివృద్ధి అవకాశాలపై అభిప్రాయాలు సేకరించనున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ చార్జింగ్ మౌలిక సదుపాయాలు, బ్యాటరీ టెక్నాలజీ, క్లీన్ మొబిలిటీ, రవాణా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై పారిశ్రామికవేత్తల సూచనలు, సలహాలను స్వీకరించనున్నారు.

సమావేశం ప్రధాన లక్ష్యాలు

రాష్ట్రంలో ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీల ఆసక్తి, పెట్టుబడి ప్రతిపాదనలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, పరిశ్రమల విస్తరణ ప్రణాళికలను తెలుసుకోవడం. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026తోపాటు నిర్వహించనున్న ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పోలో ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యాన్ని కోరడం. ఆటోమొబైల్, ఈవీ రంగాల అభివృద్ధికి అవసరమైన విధానపరమైన అంశాలు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారంపై పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకోవడం. గ్లోబల్ సమ్మిట్‌లో ఆటోమొబైల్ ఈవీ రంగంపై నిర్వహించే ప్రత్యేక సెషన్‌లో చర్చించాల్సిన కీలక అంశాలను గుర్తించడం. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తూ తెలంగాణను ఆటోమొబైల్, ఈవీ రంగాలకు ప్రధాన పెట్టుబడి గమ్యస్థానంగా అభివృద్ధి చేయడం. ఈ సమావేశ నిర్వహణకు కన్వీనర్‌గా తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖకు చెందిన లాజిస్టిక్స్, సప్లై చైన్, ఆటోమొబైల్ అండ్ ఈవీ విభాగం డైరెక్టర్ జొజాద్ షేక్‌ను నియమించారు. సమావేశ ఏర్పాట్లు, సంబంధిత పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ బాధ్యతలను ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో ప్రపంచస్థాయి పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పరిశ్రమల విస్తరణకు తెలంగాణను కీలక కేంద్రంగా నిలబెట్టే దిశగా ఈ సమావేశం ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.

పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత మీదే

హైదరాబాద్, నవంబర్ 10 :

అయ్యారు.. 112 మంది డీఎస్పీల నియామకం చాలా పెద్ద విషయం.. నియామకాల్లో ప్రభుత్వం పూర్తిస్థాయిలో పారదర్శకతను పాటించింది అని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఉన్నారంటే తమ ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని సీఎం గర్వంగా పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో గ్రూప్ 1 సహా ఇతర నియామకాల్లో తీవ్ర గందరగోళం చోటుచేసుకుందని గుర్తు చేశారు. 2011 తర్వాత దాదాపు 13 ఏళ్లపాటు గ్రూప్ 1 నియామకాలు చేపట్టకపోవడంతో నిరుద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీజీపీఎస్సీ బోర్డును రాజకీయ పునరావాసంగా మార్చి అనర్హులను నియమించడం వల్ల వ్యవస్థపై విశ్వసనీయత సన్నగిల్లిందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే యూపీఎస్సీ విధానాలను స్వయంగా అధ్యయనం చేసి టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని తెలిపారు. రిటైర్డ్ డీజీ మహేందర్ రెడ్డి, ఆ తర్వాత సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశంను చైర్మన్‌లుగా నియమించి బోర్డుపై నమ్మకాన్ని నిలబెట్టామన్నారు. ఈ నియామకాలపై కొందరు రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినప్పటికీ అభ్యర్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయం సాధించిందని



చెప్పారు.

పోలీసు అధికారులకు సీఎం హితవు

మీరు ఏ కష్టాలు పడి, ఏ లక్ష్యంతో ఈ స్థాయికి వచ్చారో ఆ నేపథ్యాన్ని ఎప్పటికీ మరచిపోవద్దు. మీ హోదాకు తగినట్లుగా నిజాయతీగా బాధ్యతలు నిర్వర్తించాలి అని నూతన డీఎస్పీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. సమస్యను పరిష్కరించాలంటే సమస్యను వినాలి, అర్థం చేసుకోవాలి..అప్పుడే పరిష్కారం పెద్ద విషయం కాదు.. సమస్య పరిష్కారంలో సమయం, రిసోర్సెస్, టెక్నికల్ సపోర్ట్ అత్యంత ముఖ్యం అన్నారు. ప్రజలకు ఏ ఆపదొచ్చినా కన్న తల్లిదండ్రుల కంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థే. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారిని ఆప్యాయంగా కూర్చోబెట్టి సమస్యను ఓపికగా విని ప్రేమపూర్వకంగా మాట్లాడాలి అని సూచించారు. వచ్చే 30 ఏళ్లపాటు తెలంగాణ భవిష్యత్తును సరైన దిశలో నడిపించే బృహత్తర బాధ్యత మీ చేతుల్లోనే ఉందన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే పెద్ద హోదా మీది.. మీ ఫీడ్‌బ్యాక్, నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతుంది.. మీరు నిటారుగా నిలబడి డ్యూటీ చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది అని స్పష్టం చేశారు. నిజాయతీగా డ్యూటీ చేయాలి, బాధ్యతను గుర్తించి పనిచేయాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇకముందు రెండో అధ్యాయం ప్రారంభం కాబోతుంది.. ఇది మీ జీవితాల్లో చాలా ముఖ్యం అన్నారు.

ఆధునిక సవాళ్లు – నూతన వ్యవస్థలు

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల సరళి కూడా మారిపోయిందని సీఎం అందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా సమాజాన్ని కుదిపేస్తున్నాయని హెచ్చరించారు. పంజాబ్ రాష్ట్రం మాదిరిగా యువత డ్రగ్స్ బారిన పడకుండా రాష్ట్రంలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అందుకోసమే ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియంత్రణ, డ్రగ్స్ కంట్రోల్, సైబర్ క్రైమ్స్ అణచివేత కోసం సరికొత్త వ్యవస్థలను తీసుకువచ్చామని, అవసరమైతే నూతన డీఎస్పీలను మెరుగైన శిక్షణ కోసం విదేశాలకు పంపిస్తామని వెల్లడించారు. అధికారులు తమ శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రొబేషనరీ డీఎస్పీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం సలహాదారు శివధర్ రెడ్డి, ఎంసీఆర్ హెచఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రాహుల్‌తో మహేశ్ కుమార్ గౌడ్ భేటీ

- తెలంగాణ కాంగ్రెస్ కార్యక్రమాలపై చర్చ
- ఈ నెల 13 లేదా 14న హైదరాబాద్‌కు రాహుల్
- గిగ్ వర్కర్లు, ఓబీసీల ప్రాతినిధ్యంపై చర్చ
- నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, నవంబర్ 10:

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ఓబీసీల ప్రాతినిధ్యం, పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చించినట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ ఈ నెల 13 లేదా 14 తేదీల్లో హైదరాబాద్‌కు రానున్నారని వెల్లడించారు. గిగ్ వర్కర్ల సమావేశంలోనూ ఆయన పాల్గొంటారని, వారితో ప్రత్యేకంగా భేటీ కావాలని కోరినట్లు చెప్పారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై రాహుల్‌కు నివేదిక అందించినట్లు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు, వివాదాలపై ఈ సమావేశంలో చర్చించలేదని, వాటిని కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎస్ఐఆర్ వ్యతిరేక సభ, మెగా బీసీ ర్యాలీకి రాహుల్‌ను ఆహ్వానించామని, వాటి తేదీలు ఇంకా ఖరారు కాలేదన్నారు. నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని వెల్లడించారు. సోనియా గాంధీ ఆత్మకథను స్వాగతిస్తున్నామని, తెలంగాణలో ఈ పుస్తకంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

భూ రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట

హైదరాబాద్, నవంబర్ 10:

తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వేలో భూ యజమానుల అభిప్రాయాలు, అభ్యంతరాలు, ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సర్వే పురోగతిని పరిశీలించారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి విడతలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి 2,720 గ్రామాల్లో సర్వే చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో సర్వే కీలక దశకు చేరుకోగా, 416 గ్రామాల్లో ప్రక్రియ పూర్తయిందన్నారు. 125 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, నాణ్యత, కచ్చితత్వం విషయంలో రాజీ పడకుండా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేకు ముందు అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులను క్షుణ్ణంగా పరిశీలించాలని పొంగులేటి ఆదేశించారు. సర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, వివరాలను పరిశీలించుకునేందుకు, అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. వచ్చిన అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. సర్వే విధానం, అభ్యంతరాల నమోదు, పరిష్కార ప్రక్రియపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. భూ రీసర్వే కేవలం రికార్డుల నవీకరణకే పరిమితం కాకుండా భూ యజమానులకు పూర్తి న్యాయం చేసే ప్రక్రియగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. చిన్నపాటి పొరపాట్లు కూడా భవిష్యత్తులో కొత్త వివాదాలకు కారణం కాకుండా ఎప్పటికప్పుడు సరిదిద్దాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యగా భూదార్ కేటాయింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయి సమస్యలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ఐటీ సంస్థలు సహకరించాలి: డీజీపీ

హైదరాబాద్, నవంబర్ 10: మహిళలు, బాలికల భద్రతకు ఐటీ సంస్థలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సహకరించాలని డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. మహిళలపై జరిగే నేరాల బాధితులకు అండగా నిలిచేందుకు కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని సూచించారు. మహిళలకు మరింత భద్రత కల్పించే లక్ష్యంతో సైబరాబాద్‌లో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఏడేళ్ల నిరీక్షణ తర్వాత ఈ కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. లైంగిక దాడులు, ఇతర నేరాల బాధితులకు వైద్య పరీక్షలు, మానసిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం ఒకే చోట అందించడం భరోసా కేంద్రాల ప్రత్యేకతని డీజీపీ వివరించారు. బాధితులు మానసిక వేదన నుంచి కోలుకునేందుకు కూడా అవసరమైన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రత్యేక పోక్సో కోర్టు ఏర్పాటు నేరస్తులకు శిక్షలు పడే శాతం పెరగడానికి దోహదపడుతోందన్నారు. భరోసా కేంద్రం నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన రహేజా డైరెక్టర్ శ్రావణ్‌ను అభినందించారు.



సైబరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి నవంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు 'సైబరాబాద్ మూవ్స్' పేరుతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఐటీ సంస్థలు, ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థలు, రవాణా నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్‌పూలింగ్, ప్రజా రవాణా వినియోగం, ఉద్యోగుల ప్రయాణ సమయాల నిర్వహణపై ఆచరణాత్మక ప్రతిపాదనలు తీసుకురావాలని కోరారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ షీ టీమ్స్, షీ షటిల్స్, ఉమెన్ పెట్రోల్ వాహనాలు, టీ సేఫ్ యాప్ ద్వారా మహిళలకు భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్ ప్రక్రియను గతంలో 57 రోజుల నుంచి ఎనిమిది రోజులకు తగ్గించామని గుర్తుచేశారు. సీసీటీఎన్ఎస్, ఈసాక్షి, ఐసీజేఎస్ వంటి సాంకేతిక వ్యవస్థల వినియోగంతో కేసుల దర్యాప్తులో పురోగతి సాధించామని, కన్విక్షన్ రేటు 22 శాతం నుంచి 42 శాతానికి పెరిగిందని వివరించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, పోలీసు అధికారులు, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లోన్ యాప్ వేధింపులకు కానిస్టేబుల్ బలి

- అప్పులు చెల్లించినా వెంటాడిన నిర్వాహకులు
- న్యూడ్ మార్ఫింగ్ ఫొటోలతో బ్లాక్‌మెయిలింగ్
- బంధువులు, స్నేహితులకు పంపిస్తామని బెదిరింపులు
- ఉరివేసుకుని ఆత్మహత్య

హైదరాబాద్, నవంబర్ 10: సైబర్ నేరగాళ్ల బ్లాక్‌మెయిలింగ్ తట్టుకోలేక ఓ పోలీసు కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీను ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. బెట్టింగ్‌లకు అలవాటుపడిన ఆయన డబ్బుల అవసరాల కోసం పలు ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించినప్పటికీ యాప్‌ల నిర్వాహకులు వేధింపులు ఆపలేదు. అక్రమ చార్జీలు, అధిక వడ్డీ పేరుతో అదనపు డబ్బులు డిమాండ్ చేస్తూ ఒత్తిడి తెచ్చారు. అంతేకాకుండా శ్రీను ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి ఆయనకు పంపించారు. తాము అడిగిన మొత్తాన్ని చెల్లించకపోతే ఆ చిత్రాలను బంధువులు, స్నేహితులకు పంపిస్తామని బెదిరించారు. పోలీసు ఉద్యోగంలో ఉండి ఇలాంటి అవమానకర పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడంతో శ్రీను తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మార్ఫింగ్ చిత్రాలు ఇతరులకు చేరితే తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలుగుతుందనే భయంతో మనస్తాపానికి లోనయ్యారు. ఈ క్రమంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ఖేలో ఇండియా' ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

- మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, నవంబర్10:

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026ను దేశం గర్వించేలా, జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రతిష్టను పెంచే విధంగా నిర్వహించాలని క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. ఈ పోటీల నిర్వహణ అవకాశం రాష్ట్రానికి రావడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి, పట్టుదల ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం బేగంపేటలోని టూరిస్ట్ ప్లాజాలో వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, క్రీడా శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గేమ్స్ నిర్వహణకు పక్కా ప్రణాళిక, అధికారుల మధ్య సమన్వయం, సమర్థవంతమైన కార్యాచరణ అవసరమని మంత్రి సూచించారు. పోటీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలన్నారు. డిప్యూటీ కలెక్టర్లకు ప్రభుత్వం అవసరమైన అధికారాలు కల్పిస్తోందని, తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు సాధించేలా నిధులను వినియోగించాలని స్పష్టం చేశారు. యువతను రీల్స్, సోషల్ మీడియా ప్రభావం నుంచి బయటకు తీసుకొచ్చి క్రీడల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని వాకిటి శ్రీహరి అన్నారు. ముఖ్యంగా బెట్టింగ్ వ్యసనానికి దూరం చేసి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లోని గ్రామీణ క్రీడా సంస్కృతిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలోని ప్రతి గ్రామంలో క్రీడా వాతావరణాన్ని పెంపొందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులను గుర్తించి శిక్షణ, ప్రోత్సాహం అందించాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ ఖేలో ఇండియా నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఈ బాధ్యతలను డిప్యూటీ కలెక్టర్లకు అప్పగించారని, వారు సమన్వయంతో పనిచేసి క్రీడా వేదికలను సిద్ధం చేయాలని కోరారు. పనుల్లో నాణ్యత, వేగం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖేలో ఇండియా నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.203 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నామని స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ వెల్లడించారు. ఇందులో రూ.120 కోట్లను క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. క్రీడాకారులు, కోచ్‌లు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, ఎండీ సోనిబాలాదేవి మాట్లాడుతూ ఇప్పటికే 11 స్టేడియాలు సిద్ధమయ్యాయని, మరో ఐదు స్టేడియాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశామని, ప్రతి పనికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించారు.

చురకలు

శ్రీశైలం, నాగార్జునసాగర్ అసలు అనుమతుల వివరాలివ్వండి

మొదటి పేజీ తరువాయి..

ఆమోదించిన ప్రాజెక్టుల వివరాలనే ప్రామాణికంగా తీసుకుని, ఆ తర్వాత చేపట్టిన మార్పులను పరిశీలించనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన, నీటి వినియోగం, కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలతో పాటు అనంతరం చేసిన మార్పులు, అదనపు నీటి అవసరాలకు సంబంధించిన సమాచారాన్ని అందించాలని కోరింది.

అనుమతి లేని 13 భాగాలపై ఆరా

2021లో జారీ చేసిన కేంద్ర నోటిఫికేషన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి 11, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు పేర్కొన్న విషయాన్ని కేఆర్ఎంబీ గుర్తు చేసింది. వీటికి సంబంధించిన సాంకేతిక అనుమతులు, కేంద్ర సంస్థల నుంచి పొందిన క్లియరెన్స్ పత్రాలను సమర్పించాలని నవంబర్ 6న రాసిన లేఖలో కోరింది. గతంలో సెప్టెంబర్ 21, అక్టోబర్ 1, అక్టోబర్ 16, అక్టోబర్ 30 తేదీల్లో సమాచారం కోరుతూ లేఖలు పంపినా.. ఇప్పటి వరకు సమాధానం అందలేదని బోర్డు పేర్కొంది.

2016 కేటాయింపులే ప్రాతిపదిక

2016 కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ కేటాయింపులు, తొలుత ఆమోదించిన ప్రాజెక్టుల రూపకల్పనలనే ప్రాథమిక ప్రాతిపదికగా పరిగణించాలని అక్టోబర్ 15న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ స్పష్టం చేసినట్లు కేఆర్ఎంబీ తెలిపింది. రెండు ప్రాజెక్టుల పరిధిలో ఆ తర్వాత చేపట్టిన మార్పులు, కొత్తగా చేర్చిన పథకాలను పరిశీలించేందుకే వివరాలు సేకరిస్తున్నామని వెల్లడించింది. ఈ ప్రక్రియ వల్ల రాష్ట్రాల నీటి హక్కులు, వాదనలకు ఎలాంటి విఘాతం కలగదని స్పష్టం చేసింది.

తాగునీటి వాటాలపై రాష్ట్రాల పట్టు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ వివాదం కొనసాగుతూనే ఉంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అంశంపై ఇటీవల హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశమైంది. ఎల్‌నినో ప్రభావం కారణంగా రెండు ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించాలనే అంశంపై చర్చించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలకు తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ కోరింది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల అవసరాల కోసం 50 శాతం వాటా కింద నీటిని విడుదల చేయాలని ప్రతిపాదించింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు 200 టీఎంసీల నీటిని కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు తమ అవసరాల కోసం 104 టీఎంసీలు కేటాయించాలని ఏపీ కోరింది. 66:34 నిష్పత్తి ప్రకారం నీటి పంపిణీ చేపట్టి, తక్షణమే తమకు 97 టీఎంసీలు విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున చెరో 50 శాతం నీటిని కేటాయించాలని తెలంగాణ పట్టుబట్టింది.

ప్రాజెక్టుల వినియోగంపై పరస్పర ఆరోపణలు

పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని తెలంగాణ ఆరోపించింది. దీనిపై ఏపీ స్పందిస్తూ.. చట్టబద్ధంగా తమకు కేటాయించిన నీటినే ఆ ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకుంటున్నామని పేర్కొంది. మరోవైపు అవసరం లేకున్నా తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని దిగువకు విడుదల చేస్తోందని ఏపీ ఆరోపించింది. ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని కృష్ణా బోర్డును కోరింది.

జనవరిలో అల్వాల్ టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం

మొదటి పేజీ తరువాయి..

గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు జనవరి నుంచి అల్వాల్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సేవలు అందుబాటులోకి రానుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. డిసెంబర్ నెలాఖరు నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభిస్తామని ప్రకటించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎం. గణేష్, ఆర్అండ్‌బీ, వైద్యారోగ్య శాఖ అధికారులతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సుమారు మూడు గంటల పాటు వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఓపీ విభాగం, డయాగ్నోస్టిక్స్, సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆక్సిజన్, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్లు, ఓపీ కౌంటర్లు, హెల్ప్‌డెస్క్‌లు, ఫార్మసీ, వైద్యుల గదులు, అత్యవసర విభాగానికి రాకపోకల ఏర్పాట్లను త్వరగా సిద్ధం చేయాలని సూచించారు. 2022 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసిన ఈ ఆసుపత్రి నిర్మాణం 2023 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. ప్రస్తుతం 95 శాతానికి పైగా సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. మొత్తం 1,000 పడకలు, 21 మేజర్, 7 మైనర్ ఆపరేషన్ థియేటర్లతో ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురానున్నారు. న్యూరాలజీ, న్యూరోసర్జరీ, జన్యు వైద్య విభాగాల్లో అత్యాధునిక చికిత్స, పరిశోధన సదుపాయాలతో దీనిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతున్నారు.

రాహుల్ పొలిటికల్ రీలాంచ్‌కు ఇది అడ్డా కాదు

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఫైర్**

హైదరాబాద్, నవంబర్ 10 :



ఎన్నికల హామీలను గాలికొదిలేసిన రేవంత్ సర్కార్ ప్రజల సొమ్ముతో రాహుల్ గాంధీని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ మీద నిలబెట్టేందుకు తాపత్రయపడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఒక ప్రకటనలో తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నిసార్లు ఫెయిలైనా రాహుల్‌ను రీలాంచ్ చేయడానికి తెలంగాణను ప్రయోగశాలగా మార్చడం సిగ్గుచేటని విమర్శించారు. ఒకపక్క రాష్ట్రం అప్పుల్లో మునిగిపోయింది.. పెండింగ్ బిల్లులు కట్టడానికి, ఇచ్చిన హామీలు అమలుకు రూపాయి లేదంటారు.. మరి రాహుల్ గాంధీ ఆర్భాటాల కోసం ఖజానా తలుపులు ఎలా తెరుచుకుంటున్నాయి అని ప్రశ్నించారు. ప్రజల కష్టార్జితం ప్రజల సంక్షేమం కోసమా.. లేక గాంధీ కుటుంబానికి రాజకీయ పునరావాసం కోసమా అని రామచందర్ రావు నిలదీశారు. ఏ ఒక్క హామీని అమలు చేయని కాంగ్రెస్ పార్టీ నేతగా రాహుల్‌కు తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే నైతిక హక్కు లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక సుమారు 40 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. జాబ్ క్యాలెండర్ హామీ ఊసే లేదు.. ఉద్యోగ నోటిఫికేషన్ల జాడే లేదు.. కొలువులు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ దగా చేసింది అని విమర్శించారు. మాటలు చెప్పి ఊరించడమే తప్ప రైతులకు 'రైతు బంధు' సాయం ఇంతవరకు ఖాతాల్లో పడలేదని, రైతులను కాంగ్రెస్ సర్కార్ నట్టేట ముంచిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వోద్యోగులకు డీఏలను పెండింగ్‌లో పెట్టారు.. రిటైర్ అయిన వారికి పెన్షన్లు, ప్రయోజనాలు అందక ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ప్రజలకు ఇవ్వడానికి డబ్బులు లేవని సాకులు చెప్పే ప్రభుత్వం రాహుల్ గాంధీ కార్యక్రమాలకు మాత్రం రాష్ట్ర ఖజానాను ఊడ్చేయడానికి సిద్ధపడటం దారుణమన్నారు. రాహుల్‌ను మార్కెట్ చేయడానికి ప్రజలు అధికారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఉద్యోగాలు వస్తాయని, సంక్షేమం అందుతుందని, రైతులు బాగుపడతారని ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మితే ఆ నమ్మకాన్ని ప్రభుత్వం నట్టేట ముంచిందని మండిపడ్డారు. ప్రజల సొమ్మును రాహుల్ రాజకీయాల కోసం దుర్వినియోగం చేయడం తక్షణమే ఆపాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేయాలని, ఉద్యోగ హామీలు నెరవేర్చాలని, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, ఉద్యోగుల పెండింగ్ డీఏలు, రిటైర్మెంట్ బకాయిలను వెంటనే జమ చేయాలని కోరారు.



'నషా ముక్త్ భారత్ అభియాన్'పై విస్తృత ప్రచారం

- **మాజీ గవర్నర్ దత్తాత్రేయ**

హైదరాబాద్, నవంబర్ 10 :

మాదకద్రవ్యాల నిరోధం కోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు యువతలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో గల ఆంధ్ర మహిళా సభ ఉమెన్స్ కాలేజీలో అలై బలై ఫౌండేషన్, వీ నెట్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' సమీక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ మత్తు పదార్థాల మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తూ యువత భవిష్యత్తును, కుటుంబ వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'వికసిత్ భారత' సాధించాలంటే యువతను ఈ వ్యసనాల బారి నుండి రక్షించడం అత్యంత ఆవశ్యకమన్నారు. కళాశాల స్థాయి నుంచే విద్యార్థులకు కౌన్సెలింగ్, అవగాహన సదస్సులు, నిరంతర ర్యాలీలు నిర్వహించడం ద్వారా మాదకద్రవ్యాల రహిత తెలంగాణను నిర్మించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ సమస్యను కేవలం ఉపన్యాసాలు, అవగాహన సమావేశాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. మాదకద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలతో, బాధితులతో నేరుగా మాట్లాడి వారిలో మార్పు తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే వాటి వ్యసనం నుంచి బయటపడేందుకు చికిత్స పొందుతున్న వారిని ప్రోత్సహించేందుకు పునరావాస కేంద్రాలను సందర్శించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం, మానసిక ధైర్యాన్ని అందిస్తామని దత్తాత్రేయ తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర మహిళా సభ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ డి.చక్రపాణి, ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర, సందీప్, విశ్వనాథ్, వీనెట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పాలమూరును పచ్చగా మార్చింది కేసీఆర్ పాలనే

- **కాంగ్రెస్ నిర్లక్ష్యంతో మూడు తరాలుగా పాలమూరుకు నష్టం**
- **రూ.35 వేల కోట్లతో పాలమూరు–రంగారెడ్డి పనులు చేపట్టాం**
- **జూరాలలో నీళ్లున్నా రైతులకు సాగునీరు ఇవ్వలేదు**
- **ఎండిన పంటలకు పరిహారం ప్రకటించాలని డిమాండ్**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**



హైదరాబాద్, నవంబర్ 10: కేసీఆర్ నాయకత్వంలోనే పాలమూరు ప్రాంతం సస్యశ్యామలమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలమూరుకు సాగునీటి విషయంలో తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. అప్పర్ కృష్ణా, భీమా, ఆర్డీఎస్, తుంగభద్ర ప్రాజెక్టులను అప్పట్లోనే నిర్మించి ఉంటే 20 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీరందేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పిదాలతో మూడు తరాల రైతాంగం నష్టపోయిందన్నారు. కేసీఆర్ హయాంలో రూ.35 వేల కోట్లతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు చేపట్టామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాలువల టెండర్లను రద్దు చేసిందని ఆరోపించారు. జూరాలలో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా రైతులకు ఇవ్వకుండా పంటలను ఎండబెట్టారని విమర్శించారు. జూరాల దిగువకు ఈ ఏడాది 245 టీఎంసీల నీరు వచ్చినా సమర్థంగా వినియోగించుకోలేకపోయారని అన్నారు. కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం కనీసం లేఖ కూడా రాయలేదని ఆరోపించారు. గత 45 రోజులుగా పాలమూరు-రంగారెడ్డి పంపులు నడిపి ఉంటే నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను నింపుకునే అవకాశం ఉండేదన్నారు. ఇప్పటికైనా ఎత్తిపోతల పంపులను ప్రారంభించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 24.40 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు ప్రభుత్వమే ప్రకటించిందని, బాధిత రైతులకు పరిహారం ఇస్తారో లేదో స్పష్టం చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించామని గుర్తుచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.వెయ్యి కోట్లు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం, స్కూటీలు, విద్యార్థుల పారితోషికాల పథకాల అమలుపైనా ప్రభుత్వాన్ని నిలదీశారు. కొడంగల్ పర్యటనలతో పాలమూరుకు ఒరిగిందేమిటో ముఖ్యమంత్రి చెప్పాలని అన్నారు. కేటీఆర్ వ్యక్తిగత ఆహార్యంపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం తగదని, ముఖ్యమంత్రి తన భాషను మార్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పుల మహేష్‌రెడ్డి, మాజీ శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్ ఎయిమ్స్‌ కు బస్సు నడపాలి

- **ఉప్పల్ నుంచి ప్రతి అరగంటకో బస్సు నడపాలి**
- **పేదలు, వృద్ధులు రవాణా పరంగా ఇబ్బందులు పడకూడదు**
- **వివిధ జిల్లా కేంద్రాల నుంచి కూడా బస్సు సదుపాయం కల్పించాలి**
- **రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ ఎంపీ వినోద్ మార్ లేఖ**

హైదరాబాద్, నవంబర్ 10: రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సులభంగా అందుబాటులోకి రావాలంటే యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఏఐఐఎంఎస్ బీబీనగర్‌కు ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై.నాగి రెడ్డికి ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల నుంచి ఏఐఐఎంఎస్ కు నేరుగా బస్సు సర్వీసులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఉప్పల్ జంక్షన్ నుంచి ఎయిమ్స్‌కు ప్రయాణికుల అవసరాలు, నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకొని ముఖ్యంగా హాస్పిటల్ రద్దీ సమయాల్లో ప్రతి 30 నిమిషాలకు ఒక ప్రత్యేక బస్సు సర్వీసును నడపాలని కోరారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానమంత్రికి ఈ అంశంపై విజ్ఞప్తి చేసి ఏఐఐఎంఎస్ ఏర్పాటుకు చొరవ తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. అప్పటి టీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు కూడా కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చి ఈ డిమాండ్ సాధనకు కృషి చేశారన్నారు. ఈ నిరంతర ప్రయత్నాల ఫలితంగా రాష్ట్రానికి ఏఐఐఎంఎస్ మంజూరైందని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం బీబీనగర్‌లో సుమారు 200 ఎకరాల భూమిని కేటాయించిందని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థ ద్వారా అందుతున్న ప్రయోజనాలు సమీప ప్రాంతాల ప్రజలకే పరిమితం కాకుండా ఇతర అన్ని జిల్లాల ప్రజలకు, ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు

జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు

- **సింగరేణి-జెన్‌కో సమన్వయ సమావేశంలో సింగరేణి సీఎండీ**

హైదరాబాద్, నవంబరు 10 :



రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు జెన్‌కో కేంద్రాలకు బొగ్గు సరఫరాపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమావేశంలో జెన్‌కోకు జరుగుతున్న సరఫరాను మరింత పెంచాలని నిర్ణయించారు. జెన్‌కో థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లకు సూచించారు. గత మూడు నాలుగేళ్లతో పోల్చి చూసినా సరే ఈ ఏడాది తెలంగాణ జెన్‌కోకు ఎక్కువ బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరిగితే సింగరేణి తన సామర్థ్యం మేరకు మరింత బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రస్తుతం మ□డు లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉందని సీఎండీ తెలిపారు. ఈ నేపథ్యంలో యాదాద్రికి బొగ్గు రవాణాను పెంచడానికి చర్యలు తీసుకోవాలని జెన్‌కోకు సూచించారు. ఒడిశాలో స్థానికంగా రవాణా సమస్యల వల్ల రవాణాలో జాప్యం జరుగుతోందని, ఈ నెలాఖరు నుంచి 16 వేల టన్నులు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ వివరించారు. గని నుంచి సమీప రైల్వే సైడింగ్ వరకు రోడ్డు మార్గంలో జరుగుతున్న బొగ్గు రవాణాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత సమావేశాల తర్వాత బొగ్గు రవాణా పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు జెన్‌కోలు సహా స్థానికంగా ఉండే పలు ప్రైవేట్ సంస్థలు కూడా నైనీ బొగ్గు కోసం విజ్ఞప్తి చేస్తున్న విషయాన్ని నైనీ జీఎం ప్రస్తావించారు. నైనీలో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో మొదటి ప్రాధాన్యంగా తెలంగాణ జెన్‌కోకు సరఫరా చేయాలని, మిగిలిన బొగ్గును కూడా ఇతర సంస్థల అవసరాల కోసం రవాణా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. రోజూ నైనీ బొగ్గు రవాణా విషయంలో జెన్‌కో అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశానికి సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె .వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమలరావు, ఈడీ(కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్(కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. జెన్‌కో డైరెక్టర్(కోల్ అండ్ లాజిస్టిక్స్) నాగ్యతోపాటు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

పోస్టర్ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట, నవంబర్ 10 :

కార్తీకమాసం పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గుర్తించి మన సంస్కృతివారసత్వాన్ని, సంప్రదాయ కళలను పరిరక్షించి ప్రోత్సహించాలనే సంకల్పంతో యాదగిరిగుట్ట దేవస్థానం(వైటీడీ) మొదటిసారిగా కార్తికోత్సవం2026 పేర మూడు రోజుల సాంస్కృతిక ఆధ్యాత్మిక మహోత్సవాన్ని నిర్వహించడానికి సన్నద్ధ□□మైంది. ఈ ఉత్సవాలలో ప్రఖ్యాత ధార్మిక పండితులు, ఆధ్యాత్మిక వక్తల ఆధ్యాత్మిక ప్రవచనాలు, మనోహరమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, ప్రముఖ సంగీత విద్వాంసులు భక్తి సంగీత కచేరీలు, ప్రసిద్ధ కళాకారులు ప్రదర్శించే వివిధ సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, భక్తిని పెంపొందించే దివ్య లక్ష్యంతో, మన సంస్కృతి శాశ్వత వైభవాన్ని, భారతదేశ శాస్త్రీయ కళారూపాల వైభవాన్ని, తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించలకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

కార్యక్రమాల వివరాలు

20వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మచే ఆధ్యాత్మిక ప్రవచనం. రాత్రి 7.30గంటల నుండి తేలు విజయచే జానపద భక్తి సంగీత కార్యక్రమం. 21న సాయంత్రం 6 గంటల నుంచి ఆర్.పి.పట్నాయక్, నిహాల్, నిత్యసంతోషిని, గోపిక పూర్ణిమ, శ్రీనిధి, స్వప్న(జర్నలిస్టు), వాద్య బృందం సహకారంతో పరంపర సంస్థ దర్శకత్వంలో నృత్య కార్యక్రమాలు. 22న సాయంత్రం 6 గంటల నుండి రుద్రాక్ష ఫౌండేషన్‌చే ఒడిస్సి నృత్య ప్రదర్శన. అభినేత్రి బృందంచే తెలంగాణ దేవాలయాల ఇతివృత్తంపై నృత్య ప్రదర్శన. రాత్రి 7 గంటల నుండి కళాకృష్ణ బృందం పేరిణి/రుద్రాక్ష ఫౌండేషన్ చే ఒడిస్సీ అభినేత్రం. రాత్రి 8 గంటల నుండి ఎ సెంబుల్ టెంపుల్స్ ఆఫ్ తెలంగాణచే నృత్య ప్రదర్శన.

అండాల సేకరణ దందాపై సర్కారు ఉక్కుపాదం



- **రాష్ట్రవ్యాప్తంగా 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను 27 కేంద్రాల్లో తనిఖీలు**
- **ఏడు హాస్పిటల్స్‌లో 13 నిబంధనల ఉల్లంఘనలు.. షోకాజ్ నోటీసుల జారీ**
- **31 మంది మహిళల గుర్తింపు.. వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ**

హైదరాబాద్, నవంబర్ 10 :

అండాల సేకరణ ముసుగులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా ఐవీఎఫ్ కేంద్రాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టింది. రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో వైద్య అధికారులు తనిఖీలు పూర్తి చేశారు. ఈ తనిఖీల్లో ఏడింటిలో 13 నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. ఆయా హాస్పిటల్స్ యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మిగిలిన కేంద్రాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. పోలీసుల స్వాధీనంలో ఉన్న రికార్డులు, జాతీయ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీ నుంచి అందే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి పలువురు మహిళలను గుర్తించగా వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు ఈనెల 6న వైద్య అధికారులు ఢిల్లీలోని నేషనల్ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని సందర్శించారు. రాష్ట్రంలో నమోదైన ఏఆర్టీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలను కోరారు. రాష్ట్రానికి సంబంధించిన సమాచారాన్ని అందజేస్తామని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్(ఎనఐసీ) అధికారులు హామీ ఇచ్చారు. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ(రెగ్యులేషన్) చట్టం2021, దాని నిబంధనలకు విరుద్ధంగా మహిళల నుంచి అండాలను సేకరించడం శిక్షార్హమైన నేరమని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని ఏఆర్టీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పొందడంతోపాటు నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల మాయమాటలు, ఆర్థిక ప్రలోభాలకు లోనై అక్రమ వైద్య విధానాలకు మహిళలు బలికావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- సైబర్ మోసాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశం
- రక్షణ ప్రణాళికను సమర్పించాలని వాట్సాప్‌కు సూచన
- 9,400 అనుమానాస్పద ఖాతాలపై ఇప్పటికే చర్యలు
- ఆటోమేటిక్‌గా గుర్తించే సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై కసరత్తు
- తదుపరి విచారణ నవంబర్ 23కి వాయిదా



న్యూఢిల్లీ, నవంబర్ 10: దేశవ్యాప్తంగా ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న డిజిటల్ అరెస్ట్ మోసాలు, సైబర్ నేరాల నియంత్రణపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. ఇలాంటి మోసాలను అడ్డుకునేందుకు తీసుకోబోయే చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని వాట్సాప్‌తో పాటు ఇతర మధ్యవర్తిత్వ సంస్థలను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జైమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సూచనలు చేసింది. 'ఇన్ రీ: విక్టిమ్స్ ఆఫ్ డిజిటల్ అరెస్ట్ రిలేటెడ్ టు ఫోర్జ్డ్ డాక్యుమెంట్స్' పేరుతో సుమోటోగా స్వీకరించిన కేసును ధర్మాసనం విచారించింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో నకిలీ పత్రాలను చూపిస్తూ ప్రజలను భయపెట్టి మోసాలకు పాల్పడుతున్న ఘటనలను అరికట్టేందుకు సంస్థలు అనుసరించనున్న రక్షణ విధానాలను వివరించాలని స్పష్టం చేసింది. తమ కార్యాచరణ ప్రణాళికలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C)కు కూడా ఒకేసారి అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 23కి వాయిదా వేసింది. వాట్సాప్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఇప్పటికే 9,400 అనుమానాస్పద ఖాతాలపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ వివరాలను పొందుపరుస్తూ పూర్తి స్థాయి అఫిడవిట్ దాఖలు చేస్తామని కోర్టుకు వెల్లడించారు. అనుమానాస్పద ఖాతాలను స్వయంచాలకంగా గుర్తించి, వాటి ద్వారా ఎదురయ్యే ముప్పుపై వినియోగదారులను ముందుగానే అప్రమత్తం చేసే అధునాతన సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. డిజిటల్ అరెస్ట్ మోసాల ద్వారా నకిలీ పత్రాలను ఉపయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నేరగాళ్లను అడ్డుకునేందుకు మరింత సమర్థమైన చర్యలు అవసరమని స్పష్టం చేసింది. ఈ తరహా మోసాల నివారణకు చేపట్టనున్న నిర్దిష్ట చర్యలు, వాటి అమలు విధానాన్ని తదుపరి విచారణలో న్యాయస్థానం ముందుంచాలని వాట్సాప్, ఇతర సంస్థలను ఆదేశించింది

తాత ఆస్తిలో మనవళ్లకు పుట్టుకతోనే హక్కు ఉండదు

- తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై ఆయనకే పూర్తి అధికారం
- ఆస్తి విక్రయాన్ని అడ్డుకోలేరని స్పష్టీకరణ
- హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం పంపకాలు
- తండ్రి వాటా వ్యక్తిగత ఆస్తిగా పరిగణన

న్యూఢిల్లీ, నవంబర్ 10: తాతల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో మనవళ్లకు పుట్టుకతోనే వాటా లభిస్తుందనే అభిప్రాయం అన్ని సందర్భాల్లో సరైనది కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తాత మరణానంతరం హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆయన ఆస్తి కుమారులు, కుమార్తెలకు పంపిణీ అయినప్పుడు.. తండ్రికి వచ్చిన వాటాపై ఆయనకే పూర్తి హక్కులు ఉంటాయని తెలిపింది. ఆ ఆస్తిని తన ఇష్టానుసారం విక్రయించుకునే అధికారం తండ్రికి ఉంటుందని, కుమారులు లేదా మనవళ్లు ఆ లావాదేవీని అడ్డుకోలేరని పేర్కొంది. చెన్నైకి చెందిన ఓ వ్యక్తి 1997లో తన తాత ఆస్తిలో సగం వాటా కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తాత ఆస్తి పంపకం ద్వారా తన తండ్రికి సంక్రమించిన భూమిని ఆయన ఇతరులకు విక్రయించడాన్ని సవాలు చేశాడు. ఈ వివాదంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. ఆ వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై కుమారుడికి పుట్టుకతోనే హక్కు ఏర్పడదని స్పష్టం చేసింది.

తండ్రి వాటా వ్యక్తిగత ఆస్తే

1956 నాటి హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం.. తాత మరణించిన తర్వాత ఆయన ఆస్తి ప్రాథమిక వారసులైన క్లాస్1 వారసులు, అంటే కుమారులు, కుమార్తెలకు చెందుతుంది. ఈ నిబంధన ప్రకారం ఆస్తి పంపిణీ జరిగినప్పుడు తండ్రికి దక్కిన వాటా ఆయన వ్యక్తిగత ఆస్తిగా మారుతుందని న్యాయస్థానం వివరించింది. అలాంటి ఆస్తిపై కుమారులు, మనవళ్లకు పుట్టుకతోనే హక్కులు ఉండవని తెలిపింది. తండ్రి జీవించి ఉన్నంతకాలం తన వాటా ఆస్తిని విక్రయించడం, ఇతరులకు బదలాయించడం సహా దానిపై నిర్ణయాలు తీసుకునే అధికారం ఆయనకే ఉంటుందని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం ఆస్తి పంపకాలు పూర్తయిన తర్వాత ఉమ్మడి కుటుంబ ఆస్తిగా కాకుండా, సంబంధిత వారసుడి వ్యక్తిగత ఆస్తిగా పరిగణించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొంది.

అందుబాటులోకి అధునాతన సదుపాయాలు

- జీఎస్ఐటీఐలో ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 10 : నాగోల్‌బండ్ల గూడ ప్రాంతంలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో పలు నూతన, ఆధునిక సదుపాయాలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. జీఎసఐ శిక్షణ సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ హాస్టల్, అడ్వాన్స్‌డ్ జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబ్, కర్మయోగి డిజిటల్ స్టూడియోలను ప్రారంభించి ఆయా విభాగాలు అందించే సేవలను పరిశీలించారు. దేశ ఖనిజ భద్రతను పటిష్టం చేసేందుకు, ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు వీలుగా వినూత్న టెక్నాలజీలను ఉపయోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్‌లో భాగంగా లిథియం, గ్రాఫైట్, కోబాల్ట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి కీలక ఖనిజాల అన్వేషణ కోసం 202627 ఆర్థిక సంవత్సరంలో జీఎసఐ 300 ప్రాజెక్టులను చేపట్టనుందని ఆయన స్పష్టం చేశారు. జియోలాజికల్ డేటా విశ్లేషణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), అధునాతన డేటా అనలిటిక్స్ వాడకాన్ని పెంచాలని మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీఎసఐ 176 సంవత్సరాల సేవలను, అలాగే ఈ శిక్షణా సంస్థ (జీఎస్ఐటీఐ) 50 వసంతాల శిక్షణ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఈ ఆధునిక వసతుల ఏర్పాటు ద్వారా హైదరాబాద్‌లోని జీఎస్ఐ శిక్షణా సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎదుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. రూ.9.12 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్టులకు సంబంధించిన ముఖ్యమైన వివరాలు ఇలా ఉన్నాయి.

ఇంటర్నేషనల్ హాస్టల్ కాంప్లెక్స్ (నలంద అండ్ తక్షశిల) : అంతర్జాతీయ అభ్యర్థులకు వసతి కల్పించేందుకు రూ.4.27 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. ఇందులో అత్యాధునిక వసతులతో కూడిన 32 సూట్లు, డైనింగ్ హాల్, జిమ్నాసియం, మినీ లైబ్రరీ, వినోద సాధనాలు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబ్: భూగర్భ ఖనిజాల అన్వేషణ, అత్యాధునిక జియోసైంటిఫిక్ పరిశోధనల కోసం డిజిటల్ డేటాను విశ్లేషించేందుకు ఈ ల్యాబ్ ఎంతో దోహదపడుతుంది. కర్మయోగి డిజిటల్ స్టూడియో: జియో సైన్స్ రంగంలో డిజిటల్ లెర్నింగ్ (ఆన్‌లైన్ శిక్షణ) సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, నాణ్యమైన విద్యా కంటెంట్‌ను రూపొందించడానికి ఈ స్టూడియోను ఏర్పాటు చేశారు.



ఢాకాను ఢిల్లీగా చూపిస్తున్న చైనా వ్లాగర్లపై భారత్ ఆగ్రహం

- బంగ్లాదేశ్ పేద ప్రాంతాల వీడియోలతో తప్పుడు ప్రచారం
- సుమారు 150 మంది చైనా వ్లాగర్లు పాల్గొంటున్నట్లు నివేదిక
- బ్రిటన్‌లో భారత కెప్టెన్ అజయ్ పంత్ అరెస్టుపై ఆరా
- అమెరికా మధ్యంతర ఎన్నికలతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు లేదని స్పష్టీకరణ
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 10: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మురికివాడలు, పేదలు నివసించే ప్రాంతాలను చిత్రీకరించి వాటిని ఢిల్లీలోని దృశ్యాలుగా ప్రచారం చేస్తున్న చైనా వ్లాగర్ల వ్యవహారంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒక దేశానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను వక్రీకరించి మరో దేశానికి ఆపాదించడం విచారకరమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. డబ్బులు తీసుకుని లేదా విదేశీ శక్తుల ప్రోద్బలంతో ఇలాంటి ప్రచారానికి పాల్పడితే అటువంటి వ్యక్తుల విశ్వసనీయతే ప్రశ్నార్థకమవుతుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్న వారిపై బంగ్లాదేశ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బంగ్లాదేశ్‌కు చెందిన 'ప్రోథోమ్ ఆలో' ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం.. సుమారు 150 మంది చైనా పౌరులు ఢాకాలోని పేద ప్రాంతాలను చిత్రీకరిస్తూ వాటిని భారత రాజధాని ఢిల్లీలోని ప్రాంతాలుగా చూపిస్తున్నారు. టెక్‌పారా, ఉత్తర తదితర ప్రాంతాల్లో వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నట్లు ఆ కథనం వెల్లడించింది. అక్కడి నివాసితుల జీవన పరిస్థితులపై అవమానకర వ్యాఖ్యలు చేస్తూ భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని పేర్కొంది. ఇదిలా ఉండగా, యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత మర్చంట్ నేవీ మాస్టర్ కెప్టెన్ అజయ్ పంత్ అరెస్టు వ్యవహారంపైనా జైస్వాల్ స్పందించారు. ఆయన న్యాయవాదులు, కుటుంబ సభ్యులతో భారత ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. లండన్‌లోని భారత హైకమిషన్ అధికారులు పలుమార్లు కెప్టెన్ పంత్‌ను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారని చెప్పారు. ఆయన భార్య పర్యటనకు కూడా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. చివరిసారిగా నవంబర్ 9న ఆమె భర్తను కలిశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై బ్రిటన్ హైకమిషన్, ఆ దేశ విదేశాంగ కార్యాలయంతోనూ చర్చలు కొనసాగుతున్నాయని, కెప్టెన్ భద్రత, సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

అమెరికా ఎన్నికల ఫలితాలపై భారత్ స్పందన

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై భారత విదేశాంగ శాఖ తొలిసారిగా స్పందించింది. అక్కడి ఎన్నికల పరిణామాలు భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపబోవని స్పష్టం చేసింది. ఇరు దేశాల భాగస్వామ్యానికి రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల నుంచి బలమైన మద్దతు ఉందని రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఎన్నికల ఫలితాలపై ప్రత్యేక వ్యాఖ్యలు చేయబోమని, రెండు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ ఎన్నికల్లో ఎదుర్కొన్న పరాజయం నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై వ్యక్తమవుతున్న సందేహాలకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. మరోవైపు భారత్‌లో గురుద్వారాలు, చర్చిలు, మసీదులు సహా మతపరమైన ప్రార్థనా స్థలాలపై దాడులు పెరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్(యూఎస్‌సీఐఆర్ఎఫ్) కమిషనర్ చేసిన వ్యాఖ్యలను కూడా జైస్వాల్ ఖండించారు. ఆ సంస్థ పక్షపాతంతో వ్యవహరిస్తోందని, సరైన అవగాహన లేకుండా రాజకీయ ప్రయోజనాలతో వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. అమెరికాలో మతపరమైన ప్రార్థనా స్థలాలపై జరుగుతున్న దాడులు, అక్కడి భారతీయులపై చోటుచేసుకుంటున్న ద్వేషపూరిత నేరాలు, జాతి వివక్ష ఘటనలపై మాత్రం ఆ సంస్థ, దాని ప్రతినిధులు స్పందించడం లేదని ఆరోపించారు. ఇలాంటి పక్షపాత సంస్థల వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

పార్లమెంట్ చరిత్రలో కొత్త రికార్డు..

- 89 రోజులుగా ప్రోరోగ్ కాని సమావేశాలు
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన వర్షాకాల భేటీలు
- 2008లో నమోదైన 87 రోజుల రికార్డు అధిగమింపు
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల కోసమేనని ప్రచారం
- డిసెంబర్ 4 నుంచి 22 వరకు శీతాకాల సమావేశాలకు అవకాశం



న్యూఢిల్లీ, నవంబర్ 10:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి నెలలు గడుస్తున్నా, వాటిని అధికారికంగా ముగిస్తూ (ప్రోరోగ్) రాష్ట్రపతి నుంచి ప్రకటన వెలువడకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆగస్టు 13న ఉభయ సభలు వాయిదా పడినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రోరోగ్ ఉత్తర్వులు జారీ కాకపోవడంతో పార్లమెంటరీ చరిత్రలో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. గతంలో 2008లో నమోదైన 87 రోజుల గరిష్ఠ వ్యవధిని ఈసారి అధిగమించింది. మరోవైపు డిసెంబర్ 4 నుంచి 22 వరకు 15 రోజుల పాటు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. 2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు జూలై 21, 22 తేదీల్లో లోక్‌సభ ప్రత్యేకంగా సమావేశమైంది. అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడింది. అయితే 87 రోజుల విరామం తర్వాత అక్టోబర్ 17న తిరిగి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలోనూ పార్లమెంట్ సమావేశాలను అధికారికంగా ప్రోరోగ్ చేయలేదు. తాజాగా ఆ రికార్డును అధిగమిస్తూ వర్షాకాల సమావేశాల ముగింపు ప్రకటన లేకుండానే సుదీర్ఘ విరామం కొనసాగుతోంది. సాధారణంగా లోక్‌సభ, రాజ్యసభలను నిరవధికంగా వాయిదా వేసిన రెండు మూడు రోజుల్లోనే సమావేశాలు ముగిసినట్లు రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదల చేస్తుంటారు. అయితే ఈసారి ఆగస్టు 13 తర్వాత అలాంటి ప్రకటన వెలువడలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 85(2) కింద రాష్ట్రపతి జారీ చేసిన సమావేశాల నిర్వహణ ఉత్తర్వులు అమల్లోనే ఉన్నట్లు భావిస్తున్నారు. దీంతో కొత్తగా సమావేశాలు నిర్వహించేందుకు రాష్ట్రపతి నుంచి మరోసారి ప్రోరోగ్ ప్రక్రియ అవసరం లేకుండానే పార్లమెంటరీ వ్యవహారాల శాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన కీలక బిల్లులను ఆమోదింప జేసుకునేందుకే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌ను ప్రోరోగ్ చేయకుండా ఉంచిందనే ప్రచారం సాగుతోంది. ఈ అంశాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించే యోచనలో కేంద్రం ఉన్నట్లు సమాచారం. గత బడ్జెట్ సమావేశాల్లో ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో ఆమోదం పొందలేదు. ఈ బిల్లు ఆమోదం పొందితే లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుత 543 నుంచి 850కి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు పార్లమెంట్ సమావేశాల ప్రోరోగ్‌పై అధికారిక ప్రకటన వెలువడకపోవడంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. డీలిమిటేషన్ బిల్లుకు అవసరమైన మెజారిటీని సమకూర్చుకునే ప్రయత్నంలో భాగంగానే కేంద్రం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా డిసెంబర్ 4 నుంచి 22 వరకు శీతాకాల సమావేశాలు నిర్వహించే అంశంపై ఈ వారంలో అధికారిక ప్రకటన వెలువడవచ్చని పార్లమెంటరీ వర్గాల సమాచారం.

వాయు కాలుష్య నియంత్రణలో కేంద్రం విఫలం

న్యూఢిల్లీ, నవంబర్ 10: దేశంలో వాయు కాలుష్యం తీవ్రత పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. బీజేపీ పాలనలో కాలుష్య నియంత్రణ కంటే ప్రచార ఆర్భాటాలు, హామీలు, రాజకీయ నిందారోపణలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గతేడాది వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) కేంద్రాల చుట్టూ నీటిని స్ప్రే చేయగా.. ఈసారి 36 కేంద్రాల్లో పీఎం 2.5 రీడింగ్స్ కనిపించకుండా పోయాయని పేర్కొన్నారు. వాయు కాలుష్యంలోనూ భారత్ విశ్వగురువుగా మారుతుందా అని ప్రశ్నించారు. 2019లోనే వాయు కాలుష్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన సవాలుగా గుర్తించారని ఖర్గే గుర్తుచేశారు. అయితే, ఆయన 12 ఏళ్ల పాలనలో సమస్య పరిష్కారానికి ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఢిల్లీలో 2023లో వాయు కాలుష్యం కారణంగా 17,188 మంది మరణించారని ఖర్గే తెలిపారు. అంతకుముందు 2021లో ఐదేళ్లలోపు పిల్లల్లో 1.69 లక్షల మరణాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఢిల్లీ క్లీన్ ఎయిర్ నిధుల్లో రూ.1,154 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోయాయని, అందుబాటులో ఉన్న నిధుల్లో కేవలం 17 శాతం మాత్రమే వినియోగించారని ఆరోపించారు. కాలుష్య నియంత్రణకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించడంతో పాటు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని సూచించారు. స్వచ్ఛమైన గాలి ప్రజల ప్రాథమిక హక్కు అని, అది ప్రభుత్వం ఇచ్చే వరం కాదని స్పష్టం చేశారు. వాయు కాలుష్యంపై ప్రధాని మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మోదీతో పెద్దగా పరిచయం లేదు.. ప్రధాని పదవి తిరస్కరణ వెనుక కారణం ఇదే..

న్యూఢిల్లీ, నవంబర్ 10:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (PM Modi)తో తనకు వ్యక్తిగతంగా పెద్దగా పరిచయం లేదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ (Sonia Gandhi) తెలిపారు. అధికారిక సమావేశాల్లో ఎదురుపడినప్పటికీ కేవలం నమస్కారంతో పలకరింపులు తప్ప ఇద్దరి మధ్య ఎలాంటి సంభాషణా ఉండదని స్పష్టం చేశారు. గతంలో ఇతర పార్టీల నేతల మధ్య ఉండే ఆప్యాయత, గౌరవప్రదమైన వాతావరణం మోదీ విషయంలో కనిపించదని వ్యాఖ్యానించారు. ఆయన తనతో కంటిచూపు కలపడానికి కూడా ఇష్టపడరని అభిప్రాయపడ్డారు. సోనియా గాంధీ (Sonia Gandhi) ఆత్మకథ 'బిలాంగిగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' నేడు పాఠకుల ముందుకు వచ్చింది. ఇవాళ ఉదయం 10 గంటలకు ఈ పుస్తకం మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చింది. యుద్ధానంతర ఇటలీలో బాల్యం, భారతదేశంలో తన జీవితం, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ప్రేమవివాహం, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ హత్యల తాలూకు విషాదాలు, రాజకీయ ప్రవేశం వంటి ఎన్నో వ్యక్తిగత, రాజకీయ ప్రయాణాలను సోనియా ఈ ఆత్మకథలో పొందుపరిచారు. అంతేకాదు, 2004లో తాను ప్రధానమంత్రి పదవిని ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందనే విషయాలను కూడా సోనియా ఈ బుక్‌లో వివరించారు. ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి కూడా తన ఆత్మకథలో సోనియా ప్రస్తావించారు. మోదీతో తన సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "పార్లమెంటరీ సమావేశాల ముగింపు సమయంలో స్పీకర్ ఛాంబర్‌లో ప్రధాన పార్టీల నేతలు కలుసుకున్నప్పుడు మాత్రమే మేము కలుసుకుంటాం. అది చాలా చిన్న గది. చాలా మంది ఉంటారు. ప్రధాని మోదీ ఎదురుపడినప్పుడు ఒకరికొకరం అధికారికంగా నమస్కారం చేసుకుంటాం. అంతే తప్ప మా మధ్య ఎలాంటి సంభాషణలూ ఉండవు. గతంలో రాజకీయ విభేదాలకు అతీతంగా నేతల మధ్య ఉండే ఆత్మీయత ప్రధాని విషయంలో కనిపించదు. నమస్కారం చేసే సమయంలో కూడా కంటి చూపు కలపడానికి కూడా ఇష్టపడరు" అని సోనియా రాసుకొచ్చారు.


మోదీతో నా పోరాటం వ్యక్తిగతం కాదు..

అది కేవలం భావజాలాల ఘర్షణే..

తామిద్దరం పూర్తిగా భిన్నమైన సైద్ధాంతిక నేపథ్యాల (Ideological worlds)నుంచి వచ్చామని సోనియా తెలిపారు. భారతదేశం గురించి మోదీకి ఉన్న భావన ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తల ఆలోచనల నుంచి రూపుదిద్దుకుందని, అది ఆయన విశ్వాసంలో మౌలవాద భావాలను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక తన విషయానికొస్తే దేశం గురించి తాను తెలుసుకున్నదంతా తన కుటుంబ సభ్యుల నుంచేనని సోనియా చెప్పుకొచ్చారు. స్వేచ్ఛా సమానత్వ సూత్రాలపై ఆధారపడి, అన్ని రకాల జాతులు, సంస్కృతులు, భాషలు, మతాలను కలుపుకొని పోయే భారతదేశంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని ఆమె వివరించారు. ప్రధాని మోదీతో తనకు ఎలాంటి వ్యక్తిగత కక్ష లేదని, ఇద్దరి మధ్య జరుగుతున్నది కేవలం భావజాలాల పోరాటమేనని సోనియా స్పష్టం చేశారు.

ప్రధాని పదవి తిరస్కరణ వెనుక కారణం ఇదే..

2004లో ప్రధాని పదవిని తిరస్కరించడానికి గల కారణాన్ని సోనియా తొలిసారి తన ఆత్మకథ ద్వారా వెల్లడించారు. ఎన్నికలకు కొన్ని నెలల ముందే ప్రధాని పదవి గురించి రాహుల్, ప్రియాంకతో చర్చించినట్లు పేర్కొన్నారు. అప్పుడు ఎన్నికల్లో పార్టీ గెలిస్తే ప్రధాని పదవిని స్వీకరిస్తారా..? అని వారు అడిగారట. అయితే, తాను వెంటనే లేదు అని కచ్చితంగా చెప్పినట్లు సోనియా చెప్పుకొచ్చారు. వారు కూడా తాను ప్రధాని కాకూడదనే కోరుకున్నట్లు వివరించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ హత్యల తదనంతరం తన పిల్లలు ఎదుర్కొన్న భయానక పరిస్థితులే తాను ప్రధాని కాకూడదని వారు భావించినట్లు తెలిపారు. ఆ పదవిలో ఉండటం ప్రాణాపాయంతో కూడుకున్నదిగా వారు భావించినట్లు చెప్పారు. ప్రధాని పదవిని చేపట్టే విషయంలో తన మనసులోని మాటను చెప్పడంతో రాహుల్, ప్రియాంక ఊపిరి పీల్చుకున్నట్లు చెప్పారు. అప్పుడే తానూ మానసికంగా తేలికపడ్డానని తన ఆత్మకథలో రాసుకొచ్చారు.



పదవులు నా లక్ష్యం కాదు

కాంగ్రెస్ పార్టీ అప్పట్లో మనుగడ కోసం పోరాడుతున్న తరుణంలో నాయకత్వ పోరు రాకూడదనే ఉద్దేశంతో ఎన్నికల ప్రచార సమయంలో ఈ విషయాన్ని బయటపెట్టలేదని సోనియా స్పష్టం చేశారు. పార్టీని ఐక్యంగా ఉంచి ప్రత్యర్థులను గట్టిగా ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. పార్టీ గెలిచిన తర్వాత జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (CPP) సమావేశంలో తాను ప్రధాని పదవిని విన్రమంగా తిరస్కరిస్తున్నట్లు ప్రకటించానని గుర్తు చేశారు. "అధికారం నన్ను ఎప్పుడూ ఆకర్షించలేదు, పదవులు నా లక్ష్యం కాదు" అని సోనియా గాంధీ తన ఆత్మకథలో స్పష్టం చేశారు. దేశ లౌకిక పునాదిని, పేదలను రక్షించడమే ఇందిరా, రాజీవ్ గాంధీల ఆశయమని.. ఆ ఆశయ సాధన కోసమే తాను పనిచేశానని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే వ్యక్తికి మంచి పాలనానుభవం, మచ్చలేని నిజాయితీ ఉండాలని తాను గట్టిగా నమ్మినట్లు సోనియా గాంధీ తన పుస్తకంలో పేర్కొన్నారు. అందుకే ప్రధాని అభ్యర్థిగా మన్మోహన్ సింగ్ పేరును ప్రతిపాదించినట్లు స్పష్టం చేశారు.

ఆ ఆరోపణల్లో నిజం లేదు..

యూపీఏ ప్రభుత్వ వ్యవహారాల్లో తన ప్రమేయంపై వచ్చిన ఆరోపణలను కూడా సోనియా కొట్టిపారేశారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో తన జోక్యం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. సింగ్ ప్రభుత్వాన్ని నడిపించగా, తాను కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించానని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకున్నానని, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ప్రభుత్వ ఫైళ్లను తెప్పించుకున్నానని వచ్చిన ఆరోపణను ఖండించారు. ప్రభుత్వ ఏర్పాటు సమయంలో తాను కొన్ని సూచనలు చేసినట్లు అంగీకరించారు.

గంప కృష్ణ ఫర్నిచర్ షాప్‌లో లక్ష్మీ పూజ.. పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



సదాశివపేట, నవంబర్ 10, :

సదాశివపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంప కృష్ణ ఫర్నిచర్ షాప్‌లో లక్ష్మీ పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యాపారవేత్త గంప కృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చిల్లపల్లి వెంకన్న బిక్షపతి, కిషన్ సార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

- ప్రజాసేవలో ముందుండే నాయకుడు ఒగ్గు శ్రీనివాస్ .. సీడీసీ చైర్మన్ గడీల రామ్ రెడ్డి



సదాశివపేట, నవంబర్, 10,:

సదాశివపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటాపురం గ్రామ సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్ జన్మదిన వేడుకలను సీడీసీ చైర్మన్ గడీల రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు శ్రీనివాస్‌కు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గడీల రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఒగ్గు శ్రీనివాస్ రాజకీయాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేయడంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడని కొనియాడారు. వెంకటాపురం సర్పంచ్‌గా గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధి కోసం అంకితభావంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పబ్బతి రత్నాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, సర్పంచులు మోహన్ గౌడ్, మద్దుం పటేల్, మల్లేశం, శంకరయ్య, విజయలక్ష్మి , సొసైటీ డైరెక్టర్లు, మండల నాయకులు మాణిక్ రెడ్డి, సురేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గాజులరామారం నాయకుడికి టీపీసీసీ లో కీలక పదవి

టీపీసీసీ అధికార ప్రతినిధిగా సొంటి రెడ్డి పున్నారెడ్డి నియామకం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధికార ప్రతినిధి (స్పోక్స్ పర్సన్)గా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సొంటిరెడ్డి పున్నారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, స్పోక్స్ పర్సన్ చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి సొంటిరెడ్డి పున్నారెడ్డిని అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పున్నారెడ్డికి తాజాగా పార్టీ అధిష్ఠానం మరో కీలక బాధ్యతను అప్పగించింది. ఈ నియామకంతో గాజులరామారం, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో ఆసక్తి నెలకొంది. టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియమితులైన సొంటిరెడ్డి పున్నారెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తున్నారు.

రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :

రాజ్యసభ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ కే లక్ష్మణ్‌ను మంగళవారం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జేకే శేఖర్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ కే లక్ష్మణ్‌తో పలు అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. పార్టీ బలోపేతం, ఓబీసీ వర్గాల అభ్యున్నతి, ప్రజా సమస్యలు తదితర అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ మర్యాదపూర్వక భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.

సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో హరీశ్ రావు ఆకస్మిక తనిఖీ

- డాక్టర్ల విధుల పట్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం.. వైద్య సేవలు మెరుగుపడాలి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, :

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించగా సంతకాలు చేసి విధులకు హాజరుకాని పలువురు వైద్యులు కనిపించడంతో సంబంధిత డాక్టర్లకు ఫోన్ చేసి ఆరా తీశారు. అనంతరం వివిధ వార్డులు, ఫార్మసీని పరిశీలించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన హరీశ్ రావు మాట్లాడుతూ ఆసుపత్రిలో 318 మంది వైద్యులు ఉన్నప్పటికీ కీలక విభాగాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో మందులు, సర్జికల్ పరికరాల కొరత ఏర్పడిందని, చిన్నపిల్లల వార్డులో పది వెంటిలేటర్లు పనిచేయడం లేదని ఆరోపించారు. సిద్దిపేట ఆసుపత్రికి సంబంధించిన రూ.30 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా రూ.1,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. నిధుల కొరతతో మోకాలి చిప్పల మార్పిడి శస్త్రచికిత్సలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన వెయ్యి పడకల ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, రోగులకు అవసరమైన శస్త్రచికిత్సలను 24 గంటల్లోగా నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇకపై ప్రతి నెలా స్వయంగా ఆసుపత్రి పనితీరును సమీక్షిస్తానని, పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



సన్న బియ్యం విక్రయాల్లో అక్రమాలకు చెక్.. రైస్ డిపోపై కేసు నమోదు..

- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి.. అధికారుల హెచ్చరిక..

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, :

సిద్దిపేట పట్టణంలో సన్న బియ్యం విక్రయాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే జరిగేలా పౌరసరఫరాల శాఖ, తూనికలు-కొలతల శాఖ అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా రత్నదీప్ సూపర్ మార్కెట్, మోర్ సూపర్ మార్కెట్, నేషనల్ సూపర్ మార్కెట్, శ్రీరాజ మల్లికార్జున రైస్ డిపో, శేషాద్రి రైస్ డిపోలను అధికారులు పరిశీలించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా తూనికలు-కొలతల అధికారి శివరంజని, సహాయ పౌరసరఫరాల అధికారి సాయి రవి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాజ మల్లికార్జున రైస్ డిపోలో బియ్యం తూకంలో తేడాలను అధికారులు గుర్తించారు. దీంతో సదరు దుకాణంపై కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా తూనికలు-కొలతల అధికారి శివరంజని తెలిపారు. వినియోగదారులకు నిర్ణీత ధరలకు సరైన తూకంతో బియ్యం విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



సిద్దిపేట జిల్లాలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- రైతులు అధైర్యపడొద్దు.. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి..
- అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, :

జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2026-27కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన మొత్తం 418 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె లక్ష్మీ కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కేంద్రాలు ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో జాప్యం జరగకుండా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని నిబంధనల ప్రకారం వెంటనే కొనుగోలు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లో నింపి, కేటాయించిన రైస్ మిల్లులు లేదా గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలోని 418 కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని అదనపు కలెక్టర్ భరోసా ఇచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు.



రైతులకు అండగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- క్వింటాలుకు రూ.2,961 వరకు చెల్లింపు
- నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యం తీసుకురావాలి సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి



సదాశివపేట, నవంబర్, 10, :

సదాశివపేట పట్టణంలో రైతులకు మద్దతు ధర అందించడంతో పాటు ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి అన్నారు. సదాశివపేట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా గడీల రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 కనీస మద్దతు ధరగా నిర్ణయించిందన్నారు. దీనికి అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ కలిపి ఏ గ్రేడ్ ధాన్యానికి మొత్తం రూ.2,961, సాధారణ రకం ధాన్యానికి రూ.2,941 చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరిచి, తగినంతగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సదాశివపేట పీఏసీఎస్ చైర్మన్ పబ్బతి రత్నాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, సర్పంచులు మోహన్ గౌడ్, మద్దుం పటేల్, మల్లేశం, శివానంద్ గౌడ్, , సొసైటీ డైరెక్టర్లు, మండల నాయకులు మాణిక్‌రెడ్డి, సురేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితోనే మానసిక ప్రశాంతత..

- 115 మందికి శివదీక్ష మాలధారణ
- 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ప్రారంభం
- మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన జీవితాన్ని పొందగలరని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో ఉన్న శ్రీ శివ సీతారామాంజనేయ దేవస్థానంలో జగన్ గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 115 మంది భక్తులు శివదీక్ష మాలధారణ చేశారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు కొలుకుల (బండి) సత్యనారాయణ నేతృత్వంలో సాయిబాబా కళ్యాణమండపంలో మంగళవారం నుంచి డిసెంబర్ 11వ తేదీ వరకు నిర్వహించనున్న 41 రోజుల అన్నదాన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివయ్య, అయ్యప్ప స్వాముల దీక్షలు స్వీకరించడం ద్వారా భక్తిభావం, ఆధ్యాత్మిక చింతన పెంపొందుతాయని, తద్వారా మనసుకు ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట ప్రాంతం సర్వమతాల సమైక్యతకు నిలయమని అన్నారు. అలాగే డిసెంబర్ 11వ తేదీన శివాలయం నుంచి శివస్వాములు మహా పాదయాత్రగా బయలుదేరి శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, బీఆర్ఎస్ యువ నాయకుడు కొలుకుల జైహింద్, నాయకులు దూడల పాపులు గౌడ్, సత్తిరెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, సుదగాని మల్లేష్ గౌడ్, గుంజా మహంకాళి, ఆకుల వినోద్ కుమార్, మహేష్, శ్రీనివాసరెడ్డి, ద్రౌపతి సంపత్ రెడ్డి, గండి రాజు యాదవ్, నర్సింహా రెడ్డి, విట్టల్, తో పాటు పలువురు భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది

- మళ్లీ బీఆర్ఎస్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, :
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలను మోసం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. చిన్నకోడూరు మండల విద్యార్థి విభాగం నూతన గ్రామ కమిటీ కార్యవర్గాల సన్మాన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.19,500 కోట్లు చెల్లించామని, కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 16,500 ఉద్యోగాలే ఇచ్చిందని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో సిద్దిపేటను అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. కాళేశ్వరం జలాలతో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి ప్రాజెక్టుల ద్వారా బీడు భూములను పచ్చని పంట పొలాలుగా మార్చామని చెప్పారు. సిద్దిపేటలో వరి దిగుబడి గణనీయంగా పెరిగిందని, ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. విద్య, వైద్యం, రవాణా రంగాల్లో సిద్దిపేటను అభివృద్ధి చేశామని, ఎల్వీ ప్రసాద్ కంటి



ఆసుపత్రి ద్వారా లక్షలాది మందికి వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. మెడికల్, పాలిటెక్నిక్, నర్సింగ్, అగ్రికల్చర్ కళాశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్థానికంగానే ఉన్నత విద్య అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ప్రభుత్వం మారినా అభివృద్ధి పనులు ఆగకూడదని, రద్దు చేసిన మంజూరైన పనులను తిరిగి చేపట్టాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో సిద్దిపేట అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలని, ఆరోగ్యం, విద్యకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విద్యార్థి నాయకులకు పిలుపు నిచ్చారు.

బియ్యం ధరలను తక్షణమే నియంత్రించాలి

- సామాన్యుడి వంటింటిపై ధరల భారం తగ్గించాలి
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :
రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న బియ్యం ధరలు పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారిందని



పేర్కొన్నారు. బియ్యం ధరలను నియంత్రించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజల నిత్యావసర సమస్యల పరిష్కారంపై తగిన దృష్టి సారించడం లేదని విమర్శించారు. ప్రతి కుటుంబానికి అన్నం అత్యంత ప్రాథమిక అవసరమని, అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యేక రాయితీపై నాణ్యమైన బియ్యం అందించాలని, రేషన్ దుకాణాల ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి సరిపడా బియ్యం పంపిణీ చేయాలని కోరారు. మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బియ్యం ధరల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే వినియోగదారులపై అదనపు ధరల భారం పడకుండా ప్రభుత్వం సమతుల్య విధానాన్ని అమలు చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. బియ్యం ధరలను వెంటనే నియంత్రించి, పేద కుటుంబాలకు ప్రత్యేక ధరల ఉపశమనం కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని వీరారెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సామాన్య ప్రజల వంటింటి సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ తరపున తమ గొంతు వినిపిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

తక్కువ ధరలకే ఎరువులు, విత్తనాలు అందించడమే లక్ష్యం

- హాకా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 10, :
జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ సమీపంలోని ఏఆర్ గార్డెన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు తక్కువ ధరలకు ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో హాకా రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. వానాకాలం వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ని కోరినట్లు తెలిపారు. రేపు పాక్స్ జగిత్యాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం చల్గల్ లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో అత్యధిక మొక్కజొన్న పంట కొనుగోలు చేయటం జరిగిందని తెలిపారు. తక్కువ సమయంలో పండే పంటలు పండించే విదంగా ఆలోచన చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని, సాగులో విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, నాయకులు చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి,



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల ముకుందం, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి ఏఎంసి వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్, సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్, ప్యాక్స్ డైరెక్టర్లు పురుషోత్తం రావు, ఏఎంసి డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి, కౌన్సిలర్ క్యాదాసు నవీన్, ఏఓ తిరుపతి నాయక్, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు పక్కా ప్రణాళిక రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్
- క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత, తాత్కాలిక సదుపాయాలను గుర్తించాలి
- గోదావరి పుష్కరాల వివిధ శాఖల పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 10, :
గోదావరి పుష్కరాలు –2027 ను దృష్టిలో ఉంచుకొని ధర్మపురి, ఇతర ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్ల కోసం పక్కా ప్రణాళిక రూపొందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల కోసం ఈ.వై. కన్సల్టెన్సీ, ఏజెన్సీ హైదరాబాద్ వారు రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు,ఈ.వై. కన్సల్టెన్సీ, ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు.

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ

పుష్కరాలకు ఇంకా ఆరు నెలల సమయం మాత్రమే ఉన్నందున ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనుల పై



ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏజెన్సీ రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి, పుష్కరాల సమయంలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించాలని, ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతిపాదించిన అంశాలతో పాటు అదనంగా అవసరమైన సదుపాయాలు, పనులను కూడా ప్రతిపాదించాలని తెలిపారు. గోదావరి పుష్కరాలు జరిగే ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయి ప్రణాళిక, ఖచ్చితమైన అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన పనుల ఎస్టిమేషన్లను మూడు రోజుల్లోగా నిర్ణీత నమూనా ఫారంలో సమర్పించాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనలు, అంచనాలు కచ్చితంగా ఉండాలని, ఏదైనా అవసరమైన పనికి నిధుల ప్రతిపాదనలో లోపం జరిగితే పుష్కరాల నిర్వహణ మొత్తం ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి ధర్మపురి గోదావరి తీరంలో స్నాన ఘాట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, మంచినీటి ట్యాపులు, పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, బస్సుల రాకపోకలు, భక్తుల నడక మార్గాలు పరస్పరం ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ

పుష్కరాల సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించేందుకు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, కీలక కూడళ్లు, ఘాట్లు, ఆలయ పరిసరాల్లో పోలీసు సిబ్బందిని నియమించడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసూనాంబ, ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ, ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కైతలాపూర్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం

- యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు.. ముఖ్య అతిథిగా బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :కైతలాపూర్ చౌరస్తాలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు సంప్రదాయబద్ధంగా సదర్ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రవికి యాదవ సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. సదర్ సమ్మేళనం సందర్భంగా యాదవ సోదరులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం కైతలాపూర్‌లో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.

కైసర్ నగర్‌లో లబ్ధిదారులకు 2 బిహెచ్కె ఇళ్ల పట్టాల పంపిణీ

కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా పట్టాలు అందజేత



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మహాదేవపురం పరిధి కైసర్‌నగర్‌లో 2 బిహెచ్కె ఇళ్లకు సంబంధించి గతంలోనే మంజూరైనప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాలను మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కొర్వి లక్ష్మి, మమతా, గౌసియా బేగమ్‌లకు ఆయన స్వయంగా 2 బిహెచ్కె ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డీసీసీ మైనారిటీ ప్రధాన కార్యదర్శి షఫీ, వలీభాయ్, సరితా యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీకేలో మంచినీరు, డ్రైనేజీ సమస్యలపై అధికారుల పర్యటన

- సమస్యల తీవ్రతను పరిశీలించిన హెచ్ ఎండబ్ల్యూఎస్ ఎస్ బీ అధికారులు.. త్వరలోనే పరిష్కరిస్తామని హామీ



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని ఆర్‌జీకేలో నెలకొన్న మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సూచనల మేరకు మంగళవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ డీజీఎం శ్రీ వాణి, మేనేజర్ కౌశిక్ ఆర్‌జీకేలో పర్యటించి మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యల తీవ్రతను గుర్తించి, స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు, ఆర్‌జీకే కాలనీ వాసులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌లో అంజలి యాదవ్‌కు మరోసారి కీలక బాధ్యతలు

- రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా తిరిగి నియామకం
- అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపిన అంజలి యాదవ్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ నూతన కార్యవర్గంలో అంజలి యాదవ్‌కు మరోసారి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అవకాశం కల్పించారు. తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలను తిరిగి అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంజలి యాదవ్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తదితర నాయకులు తనపై నమ్మకంతో మరోసారి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళల హక్కుల పరిరక్షణ, మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసమే తనకు కొండంత బలమని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీకి, మహిళలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అంజలి యాదవ్ వెల్లడించారు.

ఈ నెల 19న సిద్దిపేటకు సీఎం రేవంత్ రెడ్డి

- సిద్దిపేట వేదికగా ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం
- సిద్దిపేట నియోజకవర్గంలో 1,121 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో పర్యటించి ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. మంగళవారం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ కట్టా హైమావతితో కలిసి సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం కొండ భూదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట మున్సిపాలిటీ, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, నారాయణరావుపేట, నంగునూరు మండలాలకు చెందిన 1,121 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా ప్రతి లబ్ధిదారుడికి నెలకు సుమారు రూ.1,200 వరకు ఆదా అవుతోందని వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు ప్రభుత్వం రూ.9 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. మహిళలు ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకొని ఆ మొత్తాన్ని పిల్లల చదువులు, కుటుంబ అవసరాలకు వినియోగించు కుంటున్నారని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఎల్ఓసీలు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.3 వేల కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి అందించామని, రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఇళ్లను పేదలకు కేటాయించామని తెలిపారు. రానున్న రెండేళ్లలో మరో రెండు లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మెరుగైన భోజన సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

నీటి పొదుపుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోకపోతే మే, జూన్ నెలల్లో తీవ్ర నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిద్దిపేట పట్టణంలో అమృత్ పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించిన విధంగానే ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూడా సహకరించాలని కోరారు. జిల్లాలో కొత్తగా 15 వేల రేషన్ కార్డులు మంజూరు చేయడంతో అదనంగా 45 వేల మందికి లబ్ధి చేకూరిందని మంత్రి తెలిపారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి సిద్దిపేట పర్యటన సందర్భంగా ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.. కలెక్టర్ హైమావతి

జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, ఆత్మ చైర్మన్ పూజల గోపికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ వంతెన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 10, : జగిత్యాల – నిజామాబాద్ జాతీయ రహదారిపై జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ వద్ద చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాయికల్ మండలానికి వెళ్తున్న సందర్భంగా గాంధీనగర్ వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జగిత్యాల పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్న పైప్‌లైన్ దెబ్బతిన్న నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ స్వప్న గిరిధర్, సేవాదళ్ సెక్రటరీ ముకేష్ ఖన్నా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా జన సమీకరణ

- సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 10, : ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. సభా ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని సందర్శించి, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ

సిద్దిపేట బహిరంగ సభ వేదికగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరా భీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, బ్రేక్‌ఫాస్ట్ వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ

నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 'ఇంటింటా ఇందిరా కుటుంబం' పథకంతో పాటు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



మానకొండూరు ఎమ్మెల్యే, ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి మాట్లాడుతూ

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సిద్దిపేటకు సమీపంలోని దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, సిరిసిల్ల, మానకొండూరు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. సభకు భారీగా జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మూసాపేటలో వైభవంగా సదర్ ఉత్సవాలు

- సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 10, : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని మన పండుగలు ప్రతిబింబిస్తాయని, కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి పండుగలు జరుపుకోవడం ఎంతో సంతోషకరమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మూసాపేటలో యాదవ సోదరులు మంగళవారం నిర్వహించిన సదర్ ఉత్సవాలకు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్ని మతాల వారు కలిసికట్టుగా పండుగలు జరుపుకోవడం అభినందనీయమని, ఇలాంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తూము వేణు, తూము సంతోష్, ఎల్ ఎస్ యాదవ్, తూము వినయ్, రజనీకాంత్, నవాజ్, ముస్తఫా, పెంటయ్య, శేఖర్ గౌడ్, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నాచుపల్లి జేఎన్టీయూలో "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026-27"

చొప్పదండి ప్రతినిధి, నవంబర్ 10, : కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, 'మేరా యువ భారత్' మైభారత్ జగిత్యాల జిల్లాలోని నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలలో జిల్లా స్థాయి 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ లో భాగంగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026-27' కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా "(నాశ ముక్త్ యువ డ్రగ్ ఫ్రీ ఇండియా)" అనే కీలక అంశంపై జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జగిత్యాల జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని, సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై తమ ఆలోచనలను, ప్రసంగాల ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల, దేశ పురోగతి పట్ల అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఇలాంటి యూత్ పార్లమెంట్ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ సామర్థ్యాలను, వక్తృత్వ నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ 2047' స్వప్నాన్ని సాకారం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పునరుద్ఘాటించారు. అత్యంత ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. మొదటి బహుమతి: కె. శ్రీజ యామిని (ఫైనల్ ఇయర్ అగ్రికల్చర్ కళాశాల జగిత్యాల), రెండో బహుమతి పి.భవ్య (వెటర్నరీ కళాశాల కోరుట్ల ఫైనల్ ఇయర్), మూడో బహుమతి టి. రాంచరణ్ ప్రథమ సంవత్సరం (ఐటి జగిత్యాల జేఎన్టీయూ) గెలుచుకున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఈ విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన విజేతలకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అరుదైన అవకాశం లభిస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు ప్రవీణ్ కుమార్, సంగీత, తెలంగాణ యూనివర్సిటీ కామారెడ్డి ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య, డాక్టర్ డి. విజయ్ కుమార్, శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ డాక్టర్ భూమేష్, కళాశాల అధ్యాపక బృందం, మై భారత్ ప్రతినిధులు రాకేష్, గణేష్, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ అభివృద్ధికి మరో ముందడుగు!

- రూ.60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 10, :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గాజులరామారం డివిజన్ పరిధిలోని హెచ్ఏఎల్ కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. హెచ్ఏఎల్ ఈస్ట్, హెచ్ఏఎల్ వెస్ట్ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు, హెచ్ఏఎల్ కాలనీ నుంచి ఆదర్శ్ నగర్ వరకు లింక్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించేందుకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజనలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, కనీస మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు సైతం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల మదిలో నిలిచిపోయాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన రహదారులు, నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ అధినేత, డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, హెచ్ఏఎల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆంజనేయులు, వేణుగోపాల్ రెడ్డి, జగన్ గౌడ్, అలీ భాయ్, యాదగిరి, జేబీఎస్ మూర్తి, వేణు ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రాంబాబు, స్థానిక డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, ఇంద్రసేన రెడ్డి, కూన రాఘవేంద్ర గౌడ్, ఎం. సాగర్, సుజిత్ రెడ్డి తదితరులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి పోలీస్ అధికారులకు దీపావళి శుభాకాంక్షలు

- శాలువాలతో సన్మానించి మిఠాయిలు అందజేసిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 10, :

దీపావళి పండుగ శుభ సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ సీఐ డి స్వామి గౌడ్‌ను, ఎస్ఐలు రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్, నర్మదా మేడంలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి, మిఠాయిలు అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న పోలీస్ అధికారుల సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐతో పాటు ఎస్ఐలకు పేరుపేరునా ప్రత్యేక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ డి స్వామి గౌడ్ మాట్లాడుతూ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి తాండవ కృష్ణ, జి ప్రసాద్, చందు సాగర్, నాని తదితరులు పాల్గొన్నారు.



చింతకుంట, మోతె చెరువుల అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- జగిత్యాల మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 10, :

జగిత్యాల పట్టణంలో చింతకుంట చెరువు, మోతె చెరువుల అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చింతకుంట, మోతె చెరువుల అభివృద్ధి పనులకు సంబంధించి 2025 డిసెంబర్‌లోనే టెండర్లు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెరువుల సుందరీకరణ పనుల పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీనికి స్పందించిన కాంట్రాక్టర్ చింతకుంట చెరువు అభివృద్ధి పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. చింతకుంట చెరువులోకి ఇస్లాంపూర్ ప్రాంతం నుంచి మురుగునీరు, ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు చెరువును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మోతె చెరువు సుందరీకరణ పనుల కోసం దాదాపు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందులో 85 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం, 15 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నిధులు.



చెరువుల అభివృద్ధి, సుందరీకరణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పనులను నాణ్యతతో, నిర్దీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు.

విదేశీ విద్యకు బీసీ విద్యార్థికి ప్రభుత్వ ఆర్థిక సాయం



- విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం బండి రమేష్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 10, :

విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని, ఉన్నత విద్యకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు ఆర్థిక చేయూత అందిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద రౌలకోల వంశీ విదేశీ విద్యకు అర్హత సాధించడంతో ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం బండి రమేష్ విద్యార్థికి ప్రభుత్వ మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయంతో విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు అభ్యసించిన విద్యార్థులు తిరిగి మాతృభూమికి వచ్చి తమ సేవలను అందించాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విదేశీ విద్యకు అర్హత సాధించిన వంశీని అభినందించారు. ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, నాగార్జున, శ్రీనివాస్ బాబు, మస్తాన్ రెడ్డి, క్రాంతి, లక్ష్మయ్య, బాలరాజు, రమణ, ఆసిఫ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన "బహిరంగ సభ"

చొప్పదండి/కొడిమ్యాల, నవంబర్ 10, :

కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ 'శీతకాల ప్రత్యేక శిబిరం " 5వ రోజు రామకృష్ణాపూర్ గ్రామంలో "మూఢనమ్మకాలపై అవగాహన" బహిరంగ సభను కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంఘిక సమానత్వ సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మంత్రాలు చేతబడి బాణామతి మూఢనమ్మకమని, డ్రగ్స్ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని,



ఇటీవల కాలంలో రాష్ట్రంలో మూఢనమ్మకాల పేరుతో హత్యలు జరగడం బాధాకరమని, దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఆర్థికంగా మోసం చేస్తున్నారని, విద్యతో దేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. జగిత్యాల సిఐ, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సైన్స్ మ్యాజిక్ షోను ఉప్పులేటి నరేష్, వాలంటీర్స్ నిర్వహించారు. ఇసుక నుండి నానాలు తీయడం, విద్యార్థి చేతిపై కిరోసిన్ తో మంటలు లేపడం, నోట్లో మంటలు లేపడం, పచ్చివేపాకులపై నీటితో మంటలు లేనప్పుడు, ఇనుప చువ్వ నాలుగకు గుచ్చుకోవడం లాంటి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎసై కనకయ్య, గ్రామ సర్పంచ్ నేరెళ్ల మహేష్ , ఉప సర్పంచ్ బోగిని మల్లేశం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బండ్ల భాస్కర్, ఉదయం రామకృష్ణాపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ప్రతి ఇల్లు సందర్శించి, "సామాజిక ఆర్థిక సర్వే "నిర్వహించారు.

ప్రజల విజయం మూడేళ్ల నిరీక్షణకు తెర

- కె.పి.హెచ్ .బి లో ప్రభుత్వ పాఠశాలకు 2.39 ఎకరాల భూమి బదిలీ
- కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 10, :

కేపీహెచ్‌బీ డివిజన్ రమ్యా గ్రౌండ్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. గతంలో పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన 2.39 ఎకరాల భూమిని హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు బదిలీ చేయడంతో మూడేళ్ల నిరీక్షణకు తెరపడింది. సుమారు మూడేళ్ల క్రితం ఈ స్థలంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి పునాదులు వేసినప్పటికీ, భూమి బదిలీ ప్రక్రియలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి కృషి చేశారు. స్థానిక ప్రజలు, కాలనీవాసులు సైతం పాఠశాల నిర్మాణం కోసం తమ వంతు ప్రయత్నాలు కొనసాగించారు. ఈ క్రమంలో భూమి బదిలీ ప్రక్రియ పూర్తికావడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం కలెక్టర్ మనూ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇది ప్రజల విజయం అని, ప్రజల ఆకాంక్షలు, స్థానికుల పోరాటం, తన నిరంతర కృషి ఫలితంగా భూమి విద్యాశాఖకు బదిలీ అయిందని పేర్కొన్నారు. సహకరించిన కలెక్టర్ మనూ చౌదరికి, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు కాలనీల భూములు 22–ఏ నిబంధనల పరిధిలో ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న



ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం విద్యా రుణాలు, స్థానికులకు బ్యాంకు రుణాలు పొందడంలో ఎదురవుతున్న సమస్యలను వివరించి తగిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు నాగేశ్వరరావు, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 10, :

అత్తగారింట్లో కుటుంబ సభ్యులతో జరుగుతున్న కలహాల వల్ల జీవితం మీద విరక్తి చెందిన వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక పట్టణంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా దేవునిపల్లి గ్రామానికి చెందిన న్యాంతాబాదు వైష్ణవి (26)కి దుబ్బాక పట్టణానికి చెందిన గజబింకార్ వినయ్ కుమార్ తో 2024 నవంబర్లో వివాహం జరిగింది. గత కొంతకాలంగా అత్తగారింట్లో వైష్ణవికి, ఆమె భర్త, కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి జీవితం మీద విరక్తి చెందిన వైష్ణవి ఇంట్లోని పడకగదిలో సీలింగ్ ఫ్యాన్కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జరిగిన ఘటన సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని, పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ



ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాతాజీ నగర్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

- నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి అధికారులకు ఎమ్మెల్యే మాధవరం ఆదేశాలు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 10, :


బేగంపేట డివిజన్ పరిధిలోని మాతాజీ నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చర్యలు చేపట్టారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం మాతాజీ నగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నూతన



డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బేగంపేట డివిజన్‌లో దాదాపు 80 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశామని పేర్కొన్నారు. నూతన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, వాటర్ పైప్‌లైన్లు, శ్మశాన వాటికలు, పార్కులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కుంటుపడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, డివిజన్ అధ్యక్షులు సురేష్ యాదవ్, సురేష్, రాజయ్య, శ్రీను, రాజు, గంగారాం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యతో వ్యక్తి బలవన్మరణం

ఎల్ బంజేరుపల్లి, లింగాపూర్ గ్రామాల్లో విషాదం



దుబ్బాక ప్రతినిధి (తొగుట), నవంబర్ 10, :

అనారోగ్య సమస్యతో తరచూ సతమతమవడం తట్టుకోలేక చెట్టుకు ఉరివేసుకొని ఓ వ్యక్తి మరణించిన సంఘటన సిద్దిపేట జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం తొగుట మండలంలోని ఎల్ బంజేరుపల్లి గ్రామానికి చెందిన మ్యాకల సిద్ధిరాములు (50) జీవనోపాధి కోసం లింగాపూర్ గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. కొన్ని రోజులుగా అతడు వెన్ను, మెడ, తలనొప్పితో తీవ్ర అవస్థకు గురవుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స సైతం తీసుకొని మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మెడ, తలనొప్పి తీవ్రం కాగా భరించలేక తన వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న తొగుట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై తొగుట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఎల్ బంజేరుపల్లి, లింగాపూర్ గ్రామాల ప్రజలతో ఎంతో చనువుగా ఉంటూ, అందరి కష్ట సుఖాలలో భాగం పంచుకున్న సిద్ధిరాములు మృతి చెందడం పట్ల రెండు గ్రామాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ఏర్పాట్లు

- సభా ప్రాంగణం కోసం మంత్రులు, కలెక్టర్ తో కలిసి స్థల పరిశీలన
- పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 10, :

సిద్దిపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభ నేపథ్యంలో సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు మంగళవారం స్థల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొని సభ నిర్వహణకు అనువైన ప్రదేశాన్ని పరిశీలించారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

అందెశ్రీ ఒక సమ సమాజ స్వాప్నికుడు

దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకీ చంద్ర భాను



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, :

తెలంగాణ ప్రజా కవి, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత, ప్రపంచానికి సామాజిక జానపద గీతాల ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని చాటిన ఒక మేధావి అని, తెలంగాణ స్వాప్నికుడని సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం అందెశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకీ చంద్రభాను తెలిపారు. ఒక మారుమూల గ్రామములో జన్మించి నిరక్షరాస్యులు అయినప్పటికిని తన మేధస్సుతో అనేక పాటలను రచించి, అనేక కవితలను రచిస్తూ బర్ల కాపరిగా మొదలైన తన జీవితం ప్రపంచానికి సహితం తన మాట ద్వారా తన పాట ద్వారా తెలంగాణను పరిచయం చేసినటువంటి గొప్పవారని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరుమీద శృతి వనాన్ని ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని వారి యొక్క సేవలను గుర్తిస్తూ తెలంగాణ రాష్ట్ర గీతంగా తను రచించినటువంటి 'జయ జయహే తెలంగాణ' పాటను ప్రకటించడం అభినందనీయ మని తెలిపారు. ఆయన ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఉన్నటువంటి కవులు కళాకారులు సమసమాజ స్వామీకులందరూ కూడా కొనసాగించాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎల్ల0 తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలోని 15 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- రైతులకు రూ.50 వేల తక్షణ పరిహారం అందించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ డిమాండ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, :కరువు పరిస్థితులతో ఉపాధి కోల్పోతున్న కార్మికులను, పంట నష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ డిమాండ్ చేశారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.ఎస్. బోస్ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోని ఐదు మండలాలను మాత్రమే కాకుండా, జిల్లాలోని మొత్తం 15 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. కరువు పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు కారణంగా ఉపాధి కోల్పోయే పట్టణ ప్రాంత కార్మికులకు విభిజి రాంజీ ద్వారా ఉపాధి హామీ కల్పించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతు కుటుంబాలకు రూ.50 వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కరువు పరిస్థితులపై అఖిలపక్ష సమావే శంలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, సమావేశాలు నిర్వహించి ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణపై కేంద్రం బాధ్యత వహించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితుల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పర్యావరణ కాలుష్యానికి మైనింగ్, అడవుల నరికివేత ప్రధాన కారణాలని పేర్కొన్నారు. పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న పెట్టుబడిదారీ వర్గాలపై పన్నులు పెంచి, పేద ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న రాష్ట్రాలకు నీటి వనరులు సమృద్ధిగా ఉన్న రాష్ట్రాల నుంచి తాగునీటిని సరఫరా చేసి ప్రజలను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కరువు సహాయ ప్యాకేజీ ప్రకటించి ప్రజలకు భరోసా కల్పించాలని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా



నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచాలని, బ్లాక్ మార్కెట్‌కు కారణమవుతున్నాయని తాము పేర్కొం టున్న నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేసి రైతులకు మేలు చేసే చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని, కరువు సమస్యను రాష్ట్ర ప్రభుత్వాలకే పరిమితం చేయకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా డిప్యూటీ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజానా ట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చైతన్య గీతాలు ఆలపించారు.

భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.జి. సాయిల్ గౌడ్, కే. ఏసురత్నం, కే. ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి అన్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మి, రచ్చ కిషన్, కృష్ణ, సత్యప్రసాద్, వి. శ్రీనివాస్, నిమ్మల నరసింహులు, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, మాధవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేంద్ర ప్రసాద్, అమరావతి బాబు, యాదగిరి, దశరథ్, కాసర్ల నాగరాజు, బాపిరాజు, ఈశ్వర్, రాములు గౌడ్, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, వి. వెంకటాచారి, గౌరవ అధ్యక్షుడు ప్రవీణ్, మహిళా సమాఖ్య నాయకురాళ్లు గిరిజ, మహాలక్ష్మి, లత, నర్సమ్మ, సువర్ణ, కవిత, అనసూయ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పార్టీ నాయకులు వెంకటేష్, బాలరాజు, నాగరాజు, ఇస్తారి, మహేష్, చంద్రయ్య, సత్యనారాయణ, బాబు, సదానందం, అజీమ్, కృష్ణ, నర్సయ్యతో పాటు వందలాది మంది కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు.

వెంకట పాపయ్య నగర్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు

- రూ.6 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 10, :

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్ కాలనీలో రూ.6 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రజల



విజ్ఞప్తుల మేరకు వెంకట పాపయ్య నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కాలనీలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, యు జి డి, మంచినీటి పైప్‌లైన్ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని గాంధీ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు ఈ డి సంతోష్ రెడ్డి, జి ఎం హరి శంకర్, డిజిఎం నరేందర్, మేనేజర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాల భూములను విక్రయిస్తే సహించం

- కేపీహెచ్‌బీ, హుడా ట్రక్ పార్క్ భూముల వేలాన్ని నిలిపివేయాలి
- ఎంపీ ఈటల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 10, :

ప్రజా అవసరాల కోసం కేటాయించిన కేపీహెచ్‌బీ ప్రభుత్వ భూములను వేలం వేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్‌కు సంబంధించిన ప్రభుత్వ భూములను విక్రయించవద్దని కోరుతూ బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఏర్పాటు సమయంలోనే భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పార్కులు, క్రీడా మైదానాలు, ఇతర ప్రజోపయోగ సదుపాయాల కోసం ఎమినిటీస్ స్థలాలను కేటాయించారని గుర్తుచేశారు. ట్రక్ పార్కింగ్ అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం కూకట్‌పల్లి అత్యంత రద్దీ ప్రాంతంగా మారిందని, జనాభా పెరుగుదలతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల వేలం ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలను ఆయన సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమని, పార్కులు, క్రీడా మైదానాలు, పచ్చదనం పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తులను విక్రయించి ఆదాయం పొందాలనే ధోరణి సరికాదని విమర్శించారు. ప్రజల అవసరాలు, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను విస్మరించి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు సహించరని అన్నారు. కేపీహెచ్‌బీ ప్రభుత్వ భూములు, హుడా ట్రక్ పార్క్ భూముల వేలం ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, ఆ భూములను పూర్తిగా ప్రజా అవసరాలకే కేటాయించాలని



ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ మహిళకు సముచిత గుర్తింపు కల్పించిన ఎమ్మెల్యే సంజయ్

- జ్యోతి లక్ష్మణ్ నియామకానికి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడి ప్రత్యేక చొరవ
- ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఆడువాల జ్యోతి

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, ::

జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ నియామకంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బీసీ మహిళకు జిల్లా స్థాయిలో కీలక పదవి కల్పించాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రత్యేకంగా కోరడంతో పాటు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్



గౌడ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి నియామకానికి సహకరించారు. ఈ ప్రక్రియలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య కూడా తన వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని వ్యక్తిగత హోదాగా కాకుండా బాధ్యతగా భావించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలోని మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, మహిళల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు మహిళలను కాంగ్రెస్ పార్టీలో భాగస్వాములను చేస్తూ, పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే సంజయ్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గడ్డం పెంచుకుంటే ఇన్ని లాభాలున్నాయా?

ఒకప్పుడు లవ్ ఫెయిల్యూర్స్, తాగుబోతులు, బద్ధకస్తులు గడ్డం పెంచుకొని తిరిగేవారు. గడ్డంతో ఉండే వాళ్లను చులకనగా చూసేవారు. ఇప్పుడు గడ్డం పెంచుకోవడం ఓ ఫ్యాషన్ అయిపోయింది. ఒక స్టైల్‌తో పాటు స్టేటస్ సింబల్‌గా చూపించుకోవడానికి ఉపయోగపడుతుంది. అందుకే చాలా మంది మగవారు గడ్డం పెంచడానికి ఇష్టపడుతుంటారు. యువత ఇదొక ట్రెండ్‌గా భావించి గడ్డం పెంచుకుంటారు. గడ్డం పెంచుకోవడంతో ఆరోగ్యానికి కూడా చాలా మంచి ప్రయోజనాలు దొరుకుతాయి. అసలు గడ్డం పెంచడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు పొందుతారు? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.




యూవీ కిరణాల నుంచి రక్షణ..



సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు(యూవీ రేస్) చాలా ప్రమాదకరమన్న విషయం తెలిసిందే. ఈ కిరణాలు మన శరీరంపై పడితే చర్మ సంబంధిత క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. అయితే గడ్డం పెంచుకోవడం వల్ల ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చు. గడ్డం పెంచుకోవడం వల్ల.. ఆ గడ్డం చర్మాన్ని కవర్ చేస్తుంది. దీంతో యూవీ కిరణాలు చర్మంపై పడవు. తద్వారా యూవీ కిరణాల నుంచి వచ్చే సమస్యల బారి నుంచి తప్పించుకోవచ్చు. చలికాలంతో పాటు వేసవి కాలంలో కూడా చర్మం సాధారణనంగా పొడి బారుతూ ఉంటుంది. దీని కారణంగా చర్మం పగిలిపోవడం వంటివి జరుగుతుంటాయి. అయితే గడ్డం ఉండడం వల్ల చర్మానికి కావాల్సిన తేమ దొరుకుతుంది. తద్వారా చర్మం పొడి బారకుండా ఉంటుంది. అలాగే చర్మం పగుళ్లను నివారించుకోవచ్చు.

గొంతు సమస్యలు దూరం..



సాధారణంగా గాలిలో ఎన్నో బ్యాక్టీరియాలు, వైరస్‌లు ఉంటాయి. అయితే గడ్డం ఉండడం వల్ల ఆ బ్యాక్టీరియాలు, వైరస్‌లు నేటిలోకి అంత సులభంగా ప్రవేశించవు. దీంతో గొంతు సమస్యలు, జలుబు, దగ్గు వంటి సమస్యల బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చు. గడ్డం పెంచుకోవడం వల్ల అందంతో పాటు ఆరోగ్యం కూడా సొంతమవుతుంది.

ముడతలు రావు..



మారిపోయిన జీవన శైలి కారణంగా చాలా మందిలో చాలా తక్కువ వయసులోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తున్నాయి. ముఖంపై ముడతలు మొటిమలు వంటివి చాలా మందిని వేధిస్తున్నాయి. అయితే గడ్డం పెంచుకోవడం వల్ల ఆ సమస్యల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. గడ్డం ముఖంపై ముడతలు రాకుండా చేస్తుంది. అలాగే మనిషిని యవ్వనంగా కనిపించే విధంగా ప్రేరేపిస్తుంది. దీంతో చర్మం అందంగా, వయసు తక్కువగా కనిపిస్తుంది.

రాయల్ స్టేటస్..

గడ్డం ఉన్న వ్యక్తులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. వారి ముఖంలో తేజస్సు, రాజసం కనిపిస్తుంటుంది. అందుకే గడ్డం ఉండే వ్యక్తులకు సమాజంలో కూడా మంచి గుర్తింపు ఉంటుంది. పెద్ద మనిషి మాదిరిగా వారిని గౌరవిస్తూ ఉంటారు. ఎదో తెలియని ఆత్మవిశ్వాసం కూడా వారిలో పరిఢవిల్లుతుంది. గడ్డం ఉండడం వల్ల అందం, ఆరోగ్య ప్రయోజనాలతో పాటు సమాజంలో గుర్తింపు, గౌరవం కూడా లభిస్తుంది. అలా అని గడ్డం ఎలా పడితే అలా, పెంచకూడదు. గడ్డంను కూడా నీటిగా మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. మరీ ఎక్కువగా పెరగకుండా మరీ చిన్నగా అవ్వకుండా మెయింటైన్ చేయాలి. అప్పుడే అందంగా కనిపిస్తాము. అలా అని ఎలా పడితే అలా పెంచేస్తే మాత్రం పిచ్చోడిలాగా కనిపిస్తాము.

ఇమ్యూనిటీ ఇలా పెంచుకోండి

చలికాలంలో అందరినీ రోగాలు పలుకరిస్తూ ఉంటాయి. రోగాలు దరిచేరకుండా ఉండాలంటే ఇమ్యూనిటీ ఎంతో అవసరం. మరి ఇమ్యూనిటీని ఎలా పెంచుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. చలికాలంలో జలుబు, దగ్గు వంటి వ్యాధులు కూడా తరచూ వస్తుంటాయి.. వీటి నుంచి బయట పడాలంటే మంచి పోషకాలు ఉన్న ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి..

చలికాలంలో జలుబు, ఫ్లూతో బాధపడుతున్నట్లయితే మీ రోగనిరోధక శక్తి బలహీనంగా ఉందని అర్థం.. రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారు మాత్రమే తరచుగా వ్యాధుల బారిన పడుతుంటారు. అందుకే ఈ కాలంలో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కాగా.. ఈ చలికాలంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి మన ఇంట్లోనే తయారు చేసుకునే ఆయుర్వేద ఔషధం తయారీ గురించి తెలుసుకుందాం..

కావాల్సిన పదార్థాలు..

- ఒక చెంచా దాల్చిన చెక్క పొడి
- అర కిలో బెల్లం
- ఒక చెంచా తేనె
- ఒక చెంచా నెయ్యి
- 500 గ్రాముల ఉసిరికాయ గుజ్జు
- ఒక చెంచా జాజికాయ చూర్ణం
- ఒక చెంచా శొంఠి పొడి
- ఒక చెంచా యాలకుల పొడి



మంచి నాణ్యమైన ఉసిరి కాయలు తీసుకోండి. వాటిని నీటితో శుభ్రంగా కడగండి. నీటిలో ఉసిరి కాయలను ఉడికించండి. ఆ తర్వాత గింజలు తీసి ఉసిరి గుజ్జును బయటకు తీయండి. ఇప్పుడు స్టౌ వెలిగించి ఓ గిన్నెలో నెయ్యి వేసి వేడి చేయండి. ఇందులోనే ఉసిరి గుజ్జును వేసి సన్నటి మంటపై వేయించండి. తర్వాత బెల్లాన్ని సన్నగా తురుముకొని ఉసిరి గుజ్జులో వేసి కలపి వేయించండి. ఈ సమయంలోనే ఓ చిన్న గిన్నెలో జాజికాయ చూర్ణం, దాల్చిన చెక్క, యాలకులు, శొంఠి పొడి వేసి కలపండి. బెల్లం కరిగిన తర్వాత ముందుగా కలిపిన పొడులను ఇందులో వేసి కలిపి స్టౌ ఆఫ్ చేసి పక్కకు పెట్టుకోండి. దీనిలో తేనె కలిపితే రోగనిరోధక శక్తిని పెంచే ఔషధం రెడీ అవుతుంది.

దీన్ని ఉదయం, సాయంత్రం ఒక్కో స్పూన్ చొప్పున అర కప్పు పాలలో కలిపి తీసుకోవాలి. పాలు గొరు వెచ్చగా ఉండాలి. ఇలా కొన్ని నెలల పాటు చేస్తే.. ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందని నిపుణులు తెలిపారు.

బీర్ తాగితే కలిగే అనర్థాలు ఇవే..

చాలామంది మద్యం ప్రియులు తాము విస్కీ, రమ్, వొడ్కా కాకుండా బీర్ తీసుకుంటున్నాం కాబట్టి తక్కువ ప్రమాదంలో ఉన్నామని భావిస్తూ ఉంటారు. ఈ మధ్య ముఖ్యంగా స్కూల్, కాలేజీ స్థాయిల్లోనే బీర్లు తెగ తాగేస్తున్నారు. అయితే బీర్ కూడా ఎంతో డేంజర్ అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మన దేశంలో మద్యం సేవించే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. మద్యం తాగే వారు ముందుగా బీర్‌ను ఎంపిక చేసుకుంటారు. ఇందులో విస్కీతో పోలిస్తే కొంచెం తక్కువ మొత్తం ఆల్కహాల్ ఉంటుంది. అలాగే తాగడానికి కొంచెం సులువుగా అనిపిస్తుంటుంది. దేశంలో అనేక రకాల బీర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ బీర్‌లో 4 శాతం నుంచి 6 శాతం వరకు ఆల్కహాల్ ఉంటుంది. అయితే ఈ బీర్‌ను లిమిట్‌లో తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఇప్పటికే పలువురు ఆరోగ్య నిపుణులు తెలిపారు. అదే శృతిమించి తాగితే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ఇంతకీ వారానికి ఎన్ని బీర్లు తాగాలి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

14 యూనిట్లు మాత్రమే..

నేషనల్ హెల్త్ సర్వీసెస్ ప్రకారం పురుషులు లేదా మహిళలు వారానికి కేవలం 14 యూనిట్ల కంటే ఎక్కువ మద్యం తీసుకోకూడదు. 14 యూనిట్లు లేదా 10 మిల్లి లీటర్లు, లేదా 8 గ్రాముల మధ్య మాత్రమే తీసుకోవాలి. అప్పుడే అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి. ఉదాహరణకు ఒక బీర్‌లో 5 శాతం ఆల్కహాల్ ఉంటుంది. అంటే అందులో 3 యూనిట్ల ఆల్కహాల్ ఉంటుంది. అంటే మీరు వారానికి ఆరు బాటిళ్ల సాధారణ బీర్ తాగితే మీరు 14 యూనిట్ల పరిమితిలో ఉంటారు. అంతకు మించి తాగితే కచ్చితంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒకవేళ ప్రతిరోజు ఆల్కహాల్ తాగాలనుకునే వారు.. వారంలో కనీసం రెండు రోజులు ఆపేయాలి. ఇలా చేయడం వల్ల ఆల్కహాల్ నుంచి శరీరం కోలుకోవడానికి కొంత సమయం దొరుకుతుంది. అలాగే అనారోగ్య సమస్యల బారిన పడకుండా రక్షించుకోవచ్చు.


గుండె సమస్యలు..

బీర్ లో టాప్ 10 ఆశ్చర్యకరమైన హెల్త్ బెనిఫిట్స్ "బీర్ లో టాప్ 10 ఆశ్చర్యకరమైన హెల్త్ బెనిఫిట్స్ "

సాధారణంగా బీర్‌లో చిన్న మొత్తంలో విటమిన్లు, యాంటీ యాక్సిడెంట్లు, ఖనిజాలు ఉంటాయి. అవి ఎముకలను దృఢపరుస్తాయి.

దీని కారణంగా ఎముకలకు సంబంధించిన వ్యాధులు తగ్గిపోతాయి. అలాగే ఈ బీర్‌లో పాలిఫెనాల్స్ అనే పదార్థం ఉంటుంది. ఇవి గుండెకు సంబంధించిన సమస్యలు దూరమైపోతాయి.

అలాగే ఇతర రోగాలు కూడా నయమవుతాయి. సాధారణంగా రోజుకు ఒక బీరు తాగే మహిళలు, రోజుకు రెండు బీర్లు తాగే పురుషుల్లో గుండె సంబంధిత సమస్యలు రావని ఓ అధ్యయనంలో వెల్లడైంది.



సెహ్వాగ్ విధ్వంసం.. సెమీస్‌కు భారత్!

అండర్-19 ఆసియా కప్‌లో టీమిండియా జోరు



- యూఏఈపై 70 పరుగుల తేడాతో ఘన విజయం
- 160 పరుగులతో చెలరేగిన ఆర్యవీర్ సెహ్వాగ్
- 17 ఫోర్లు, 7 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన యువ సంచలనం
- మూడో వికెట్‌కు వినీత్‌తో కలిసి 193 పరుగుల భాగస్వామ్యం
- నాలుగు వికెట్లతో యూఏఈని దెబ్బతీసిన ఇషాన్ సూద్

అల్ అమరాత్ (ఒమన్), నవంబర్ 10 :: అండర్-19 ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత యువ జట్టు విజయపరంపర కొనసాగిస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో జరిగిన కీలక పోరులో భారత్ 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సె మీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ బ్యాటర్ ఆర్యవీర్ సె హ్వాగ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 17ఫోర్లు, ఏడు సిక్సర్లతో 160 పరుగులు చేసి భారత విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడికి వి.కె. వినీత్ అండగా నిలవడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 310 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 239 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్ ఇషాన్ సూద్ నాలుగు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బతీశాడు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయ్‌చందాని 17 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయితే ఆర్యవీర్ సెహ్వాగ్ క్రీజులో నిలదొక్కుకుని ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ప్రారంభంలో ఆచితూచి ఆడిన అతడు ఆ తర్వాత దూకుడు పెంచాడు. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీల వర్షం కురిపించాడు. మైదానం నలువైపులా ఆకర్షణీయమైన షాట్లతో పరుగులు రాబట్టాడు. అతడి బ్యాటింగ్ ధాటికి యూఏఈ బౌలర్లు పరుగులను నియంత్రించలేకపోయారు. ఆర్యవీర్‌కు వి.కె. వినీత్ చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఒకవైపు ఆర్యవీర్ భారీ షాట్లతో విరుచుకుపడుతుండగా, మరోవైపు వినీత్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేశాడు. 67 పరుగులతో జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ జోడీని విడదీయడానికి యూఏఈ బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. చివరకు నశీమ్ ఖాన్ వీరిద్దరినీ పెవిలియన్‌కు పంపించాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ తన ఇన్నింగ్స్‌లో 160 పరుగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అతడి బ్యాట్ నుంచి 17 ఫోర్లు, ఏడు భారీ సిక్సర్లు వచ్చాయి. బౌండరీల రూపంలోనే 110 పరుగులు సాధించడం అతడి దూకుడుకు నిదర్శనంగా నిలిచింది. ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ భారత ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. అతడి అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. ఆర్యవీర్, వినీత్ కీలక భాగస్వామ్యం అనంతరం భారత బ్యాటర్లు స్కోరును మరింత పెంచేందుకు ప్రయత్నించారు. చివర్లో యశ్‌వర్ధన్ చౌహాన్ 17 పరుగులు, అన్వయ్ ద్రావిడ్ 12 పరుగులు చేశారు. దీంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగులు సాధించి యూఏఈ ముందు 310 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారీ లక్ష్య ఛేదనలో యూఏఈ బ్యాటర్లు పోరాడినప్పటికీ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. అహ్మద్ ఖుదాదాద్ 74 పరుగులతో జట్టులో అత్యధిక స్కోరు సాధించాడు. నూర్‌ఉల్లా అయోబీ 39 పరుగులు, యాపిన్ రాయ్ 29 పరుగులు, కెప్టెన్ అయాన్ మిస్బా 27 పరుగులతో సహకరించారు. అయితే కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో లక్ష్య ఛేదన కష్టంగా మారింది. చివరకు యూఏఈ 239 పరుగులకే పరిమితమై ఓటమి చవిచూసింది. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ అద్భుత ప్రదర్శన చేశాడు. కీలక సమయాల్లో నాలుగు వికెట్లు పడగొట్టి యూఏఈ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. ఇతర బౌలర్లు కూడా సహకరించడంతో ప్రత్యర్థి జట్టు లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. బ్యాటింగ్‌లో ఆర్యవీర్ సెహ్వాగ్, బౌలింగ్‌లో ఇషాన్ సూద్ భారత విజయానికి ప్రధాన కారకులయ్యారు. ఈ విజయంతో అండర్--19 ఆసియా కప్ సెమీఫైనల్‌లో భారత్ తన స్థానాన్ని ఖరారు చేసుకున్నట్లు అందించిన మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. ఆర్యవీర్ సెహ్వాగ్ భారీ ఇన్నింగ్స్, వినీత్ కీలక భాగస్వామ్యం, ఇషాన్ సూద్ బౌలింగ్ ప్రదర్శన జట్టుకు విజయాన్ని అందించాయి. తదుపరి పోరులోనూ ఇదే జోరు కొనసాగించాలని భారత యువ జట్టు భావిస్తోంది.

ఐపీఎల్‌లోకి మరో రెండు జట్లు
ఇక క్రికెట్ పండగే!

- 2028 నుంచి 12 జట్లతో ఐపీఎల్ నిర్వహణకు కసరత్తు?
- కొత్త జట్ల రేసులో పూణే, వడోదర నగరాల పేర్లు
- ఒక్కో జట్టు విలువ రూ.వేల కోట్లకు చేరే అవకాశం
- దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల నుంచి భారీ ఆసక్తి
- కొత్త ప్రసార హక్కుల కాలానికి అనుగుణంగా విస్తరణ యోచన
- మ్యాచ్‌ల సంఖ్య, ఆటగాళ్ల లభ్యతపై బీసీసీఐ దృష్టి



ముంబయి, నవంబర్ 10 :: ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన క్రికెట్ లీగ్‌లలో ఒకటైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు మరో ఆసక్తికర వార్త వినిపిస్తోంది. ప్రస్తుతం పది జట్లతో జరుగుతున్న ఈ మెగా క్రికెట్ సమరంలోకి మరో రెండు కొత్త జట్లను తీసుకురావాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. 2028 సీజన్ నుంచి మొత్తం 12 జట్లతో ఐపీఎల్‌ను నిర్వహించే అవకాశాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పరిశీలిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. కొత్త ఫ్రాంచైజీల కోసం మహారాష్ట్రలోని పూణే, గుజరాత్‌లోని వడోదర నగరాల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెరగడంతోపాటు మరింత మంది యువ క్రికెటర్లకు అవకాశాలు లభించే వీలుంది. అయితే కొత్త జట్ల చేరికపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఐపీఎల్‌ను మరింత విస్తరించాలనే ఆలోచనలో భాగంగా 2028 సీజన్ నుంచి రెండు కొత్త ఫ్రాంచైజీలను చేర్చే అవకాశాలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం లీగ్‌లో పది జట్లు పాల్గొంటుండగా, మరో రెండు జట్లు చేరితే వాటి సంఖ్య 12కు పెరుగుతుంది. దీంతో లీగ్ పరిధి మరింత విస్తరించడంతోపాటు కొత్త నగరాలకు ఐపీఎల్ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త జట్ల కోసం పూణే, వడోదర నగరాల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గుజరాత్‌ను ప్రముఖ క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రయత్నాల నేపథ్యంలో వడోదర పేరు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే గుజరాత్ టైటాన్స్ రూపంలో ఆ రాష్ట్రానికి ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం ఉంది. మరోవైపు పూణే నగరానికి ఐపీఎల్‌తో గతంలోనే అనుబంధం ఉంది. పూణే వారియర్స్ ఇండియా, రైజింగ్ పూణే సూపర్‌జెయింట్ జట్లు గతంలో ఈ నగరం నుంచి లీగ్‌లో పాల్గొన్నాయి. దీంతో పూణేలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ, మౌలిక వసతులు కొత్త ఫ్రాంచైజీ ఏర్పాటుకు అనుకూలంగా ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో కొత్త జట్ల కొనుగోలుకు భారీ పోటీ నెలకొనే అవకాశముందని అంచనాలు వినిపిస్తున్నాయి. ఒక్కో కొత్త ఫ్రాంచైజీ విలువ ఒక బిలియన్ అమెరికా డాలర్లకు మించి ఉండవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. భారతీయ వ్యాపార సంస్థలతోపాటు యూరప్, పశ్చిమాసియా ప్రాంతాలకు చెందిన పెట్టుబడి సంస్థలు కూడా ఐపీఎల్‌పై ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కొత్త జట్ల వేలం, కనీస ధర, పెట్టుబడిదారుల వివరాలపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. 2028 నుంచి 2032 వరకు ఉండే తదుపరి ప్రసార హక్కుల కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఐపీఎల్ విస్తరణపై ఆలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. కొత్త జట్లు చేరితే మ్యాచ్‌ల సంఖ్య పెరిగే అవకాశముండటంతో ప్రసార హక్కుల విలువపైనా ప్రభావం పడవచ్చని భావిస్తున్నారు. అయితే మ్యాచ్‌ల సంఖ్య పెరగడం వల్ల లీగ్ నిర్వహణకు అదనపు సమయం అవసరమవుతుంది. అంతర్జాతీయ క్రికెట్ పోటీలతో సమన్వయం చేసుకోవడం, ప్రసారకర్తల ఆసక్తి, ఆదాయ పంపిణీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఐపీఎల్‌లో చివరిసారిగా 2022 సీజన్‌లో రెండు కొత్త జట్లు ప్రవేశించాయి. లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ చేరికతో లీగ్‌లో జట్ల సంఖ్య ఎనిమిది నుంచి పదికి పెరిగింది. ఈ విస్తరణతో మరింత మంది ఆటగాళ్లకు అవకాశాలు లభించడంతోపాటు కొత్త అభిమాన వర్గాలు లీగ్‌తో అనుసంధానమయ్యాయి. ఇప్పుడు మరో రెండు జట్లను చేర్చే ప్రతిపాదన అమలైతే ఐపీఎల్ మరింత విస్తృత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. కొత్త జట్ల చేరిక అనేది కేవలం పెట్టుబడులు, ఫ్రాంచైజీల కొనుగోలుతో ముగిసే అంశం కాదు. మొత్తం మ్యాచ్‌ల సంఖ్య, లీగ్ నిర్వహణకు అవసరమైన రోజులు, దేశీయ క్రికెట్ పోటీలపై ప్రభావం, అంతర్జాతీయ ఆటగాళ్ల లభ్యత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. జట్ల సంఖ్య పెరిగితే ఆటగాళ్ల ఎంపిక విధానం, వేలం ప్రక్రియ, జట్లలో ఆటగాళ్ల సంఖ్య వంటి అంశాల్లోనూ మార్పులు అవసరమయ్యే అవకాశం ఉంది. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే విస్తరణపై తుది నిర్ణయం తీసుకునే వీలుంది. కొత్త జట్ల చేరికకు సంబంధించిన ప్రచారం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ముఖ్యంగా పూణే, వడోదర నగరాలకు ప్రాతినిధ్యం లభిస్తుందా అనే అంశంపై చర్చ జరుగుతోంది. మరో రెండు జట్లు చేరితే కొత్త ఆటగాళ్లకు అవకాశాలు పెరగడంతోపాటు ఐపీఎల్ పోటీ మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



సమాజ్‌వాది పార్టీ ఎంపీని పెళ్లి చేసుకోబోతున్న క్రికెటర్ రింకూ సింగ్

క్రికెటర్ రింకూ సింగ్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఓ మహిళా ఎంపీని ఆయన పెళ్లి చేసుకోబోతున్నాడు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియ సరోజ్‌తో రింకూ సింగ్ వివాహం జరుగనుంది. డిసెంబర్ 4న లక్నోలో వారి వివాహ వేడుక జరగనుంది. పెళ్లి ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. క్రికెట్, బాలీవుడ్, వ్యాపార, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులను వివాహానికి ఆహ్వానించనున్నారు. ప్రియ సరోజ్ ఇప్పటికే తమ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను కలిసి వివాహానికి ఆహ్వానిస్తూ శుభలేఖ అందించారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని రింకూ సింగ్ కుటుంబంతో కలిసి తమ వివాహానికి ఆహ్వానిస్తారని సమాచారం. ప్రియ సరోజ్ 2024 ఎన్నికల్లో మచిలీషహర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆమె ఆర్ట్స్, న్యాయవాద విద్యలో డిగ్రీలు పూర్తి చేసింది. ప్రియతో రింకూ నిశ్చితార్థం గత ఏడాది జూన్ నెలలో జరిగింది.



టోర్నీలోనే సరికొత్త రికార్డు!

బ్యాటింగ్‌లో వీరవిహారం చేసిన ఆర్యవీర్ సెహ్వాగ్..

దుబాయ్, నవంబర్ 10 :: యూఏఈతో జరిగిన ఏసీసీ మెన్స్ అండర్-19 ఆసియా కప్ మ్యాచ్‌లో భారత యువ సంచలనం, భారత మాజీ దిగ్గజ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుతమైన డబుల్ సెంచరీ స్థాయి ఇన్నింగ్స్ (160 పరుగులు)తో చెలరేగిపోయాడు. పాకిస్థాన్‌తో జరిగిన మునుపటి మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలైన తర్వాత మళ్లీ ఫామ్‌లోకి రావడానికి ఈ మ్యాచ్ అత్యంత కీలకమైంది. అటువంటి తీవ్రమైన ఒత్తిడి సమయంలో ఆర్యవీర్ అత్యంత బాధ్యతాయుతమైన ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. పిచ్ పరిస్థితులు బ్యాటింగ్‌కు అనుకూలంగా లేని సమయంలో ఆర్యవీర్ ఎంతో పరిణతితో బ్యాటింగ్ చేశాడు. ఆరంభంలో బంతి సీమ్ అవ్వడం, స్పిన్ కావడం, అదనంగా నెమ్మదించడంతో అతను చాలా జాగ్రత్తగా ఆడాడు. తొలి గంటలో పిచ్ నుంచి తీవ్రమైన సవాలు ఎదురైనప్పటికీ, ఓపికగా క్రీజులో నిలబడి 69 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత పిచ్ కుదురుకోవడంతో తన షాట్ల విన్యాసాలను ప్రారంభించాడు. ముఖ్యంగా స్పిన్నర్లు రంగంలోకి దిగిన తర్వాత తన మార్క్ ఆధిపత్యం ప్రదర్శించాడు. క్రీజు వెలుపలికి వచ్చి కవర్స్ మీదుగా భారీ సిక్సర్లు కొట్టడం, లోపలికి వచ్చే బంతులను లాంగ్-ఆన్, లెగ్ సైడ్ వైపు స్లాగ్-స్వీప్ చేయడం ద్వారా పరుగుల వేగాన్ని పెంచాడు. మొత్తంగా 131 బంతుల్లో సెంచరీ చేరుకున్న ఆర్యవీర్, ఆ తర్వాత మరింత విరుచుకుపడ్డాడు. యూఏఈ స్పిన్నర్ ఉద్దిష్ సూరి వేసిన ఒకే ఓవర్‌లో 21 పరుగులు రాబట్టి ఆధిపత్యాన్ని పూర్తిస్థాయిలో చేజిక్కించుకున్నాడు. 160 బంతుల్లో 150 పరుగుల మైలురాయిని దాటిన అతను, చివరికి 45వ ఓవర్‌లో 160 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. అతని ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. ఇది ఈ టోర్నీలోనే ఒక బ్యాటర్ నమోదు చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. మరోవైపు వి.కె. వినీత్ (60 బంతుల్లో అర్ధసెంచరీ) కూడా అద్భుతమైన సహకారం అందించడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. తండ్రి వీరేందర్ సెహ్వాగ్ శైలికి భిన్నంగా ఆర్యవీర్ సాంప్రదాయక ఓపెనర్‌గా కనిపించాడు. క్రీజును పూర్తిగా వాడుకుంటూ, ప్రారంభంలో ఒత్తిడిని తట్టుకుని, ఆ తర్వాత ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే అతని శైలి అందరినీ ఆకట్టుకుంది. తండ్రి 'స్టాండ్ అండ్ డెలివర్' పద్ధతికి కాస్త దూరంగా ఉన్నప్పటికీ, పరుగులు రాబట్టడంలో తండ్రికి తగ్గ తనయుడిగా నిరూపించుకున్నాడు.

పవన్ కల్యాణ్- అన్నా లెజినోవా వైవాహిక బంధంపై చర్చ..

ఆమె ఆస్తులు రూ. 1,800 కోట్లా!



అమరావతి, నవంబర్ 10 :: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కీలక వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా తమ 13 ఏళ్ల సుదీర్ఘ వైవాహిక బంధానికి అధికారికంగా ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించారు. పరస్పర అంగీకారం, అవగాహన, గౌరవంతో విడిపోవాలని తాము నిర్ణయించుకున్నట్లు ఇద్దరూ ఉమ్మడిగా ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భార్యాభర్తలుగా తమ ప్రయాణం ముగిసినప్పటికీ, ఇకపై మంచి స్నేహితులుగా కొనసాగుతామని స్పష్టం చేశారు. ఈ వార్త పవన్ కల్యాణ్ అభిమానులను, పార్టీ శ్రేణులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. పవన్ కల్యాణ్, అన్నా లెజినోవా 2013 సెప్టెంబర్ 30న వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అప్పటి నుంచి వీరిద్దరూ తమ వ్యక్తిగత జీవితాన్ని మీడియా దృష్టికి దూరంగా ఉంచుతూ వచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ కాగా, కుమార్తె పొలెనా అంజనా పవనోవా కూడా ఉన్నారు. పరస్పర అంగీకారంతో విడిపోతున్నప్పటికీ, పిల్లల భవిష్యత్తు, సంతోషం, శ్రేయస్సుకే తమ మొదటి ప్రాధాన్యత అని, వారి పెంపకంలో బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా కలిసి ఉంటామని వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో తమ వ్యక్తిగత ప్రైవసీని గౌరవించాలని మీడియాను, అభిమానులను కోరారు. 'తీన్ మార్' పరిచయం నుంచి రూ. 1,800 కోట్లకు పైగా ఆస్తుల ప్రచారం వరకు రష్యాకు చెందిన అన్నా లెజినోవా మోడల్‌గా, నటిగా గుర్తింపు పొందారు. 2011లో విడుదలైన పవన్ కల్యాణ్ చిత్రం 'తీన్ మార్' షూటింగ్ సమయంలో వీరిద్దరికీ మొదటిసారి పరిచయం ఏర్పడింది. ఆ సినిమాలో అన్నా ఒక చిన్న పాత్రలో కనిపించారు. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారి 2013లో వివాహానికి దారితీసింది. విద్యాపరంగా, వ్యాపారపరంగా కూడా అన్నా లెజినోవా ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు సమాచారం. 2024లో సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పొందినట్లు కథనాలు వచ్చాయి. అంతేకాకుండా, హాస్పిటాలిటీ రంగంపై ఆసక్తితో సింగపూర్, రష్యాల్లోని ప్రముఖ హోటళ్లు, వ్యాపారాలలో ఆమెకు భాగస్వామ్యాలు ఉన్నాయని తెలుస్తోంది. కొన్ని అంతర్జాతీయ కథనాలు, నివేదికల ప్రకారం రష్యా, సింగపూర్‌లలో ఆమెకు సుమారు రూ. 1,800 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు విపరీతంగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఆస్తుల విలువ లేదా యాజమాన్య హక్కులపై అన్నా లెజినోవా తరఫు నుంచి కానీ, పవన్ కల్యాణ్ బృందం నుంచి కానీ ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదా స్పష్టత వెలువడలేదు.



దీపావళి అయిపోయినా అర్ధరాత్రి పేల్చడం ఏంటి..

'ఇతరులను హింసించకండి' అంటూ రేణూ ఘాటు వ్యాఖ్యలు!

హైదరాబాద్, నవంబర్ 10 :: దీపావళి పండుగ ముగిసినప్పటికీ అర్ధరాత్రి వేళల్లో భారీ శబ్దాలు వచ్చే టపాసులు కాల్చడంపై ప్రముఖ నటి రేణూ దేశాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎదుటివారి ఇబ్బందులను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం మూర్ఖత్వమేనని మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ఆమె పెట్టిన సుదీర్ఘ పోస్ట్ ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పండుగను ఆనందంగా జరుపుకోవడంలో తప్పులేదని, అయితే ఆ ఆనందం ఇతరులకు ఇబ్బందిగా మారకూడదని హితవు పలికారు. దీపావళి సమయంలో టపాసుల శబ్దాలపై తాను వెంటనే స్పందించకపోవడానికి గల కారణాన్ని కూడా వెల్లడించారు. పండుగ రోజున ఈ విషయంపై మాట్లాడితే తనను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేసే అవకాశం ఉందని భావించి మౌనంగా ఉన్నట్లు తెలిపారు. పండుగ పూర్తయిన తర్వాత కూడా అర్ధరాత్రి వేళల్లో భారీ శబ్దాలతో టపాసులు కాల్చడంపై ఆమె గట్టిగా ప్రశ్నించారు. రాత్రి 11 గంటలవుతున్నా ప్రజలు ఇంకా పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాలుస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి రోజున తాను ఏమైనా మాట్లాడి ఉంటే తనను హిందూ వ్యతిరేకి అని ముద్ర వేసేవారని, అందుకే ఆ రోజు మౌనంగా ఉండిపోయానని పేర్కొన్నారు. కానీ పండుగ అయిపోయిన తర్వాత కూడా రాత్రి 11 గంటలకు ఇంత పెద్ద శబ్దాలతో టపాసులు కాల్చడానికి ఇప్పుడు ఏ పండుగ ఉందంటూ నిరసన వ్యక్తం చేశారు. టపాసుల భారీ శబ్దాల వల్ల సమాజంలో ఎదురయ్యే తీవ్ర సమస్యలను కూడా రేణూ దేశాయ్ ప్రస్తావించారు. ప్రతి ఒక్కరూ తమ ఆనందం గురించి మాత్రమే ఆలోచిస్తూ, చుట్టుపక్కల ఉన్న వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతరుల బాధలను అర్థం చేసుకోకపోవడం, కనీస సానుభూతి చూపించకపోవడం సరికాదన్నారు. దీపావళి అనేది దీపాల పండుగ అని, దానిని శబ్దాల పోటీగా మార్చకూడదని సూచించారు. వేడుకల కారణంగా పక్కవారికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. టపాసులు కాల్చడంపై ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, కనీసం రాత్రి 10 గంటలలోపే టపాసులు కాల్చడం పూర్తి చేసి ప్రజలను ప్రశాంతంగా నిద్రపోనివ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ సరదా కోసం ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని స్పష్టం చేశారు. మీ ఆనందం కోసం తోటి మనుషులను హింసించకండి, కొంచెం దయ చూపించండి అంటూ విజ్ఞప్తి చేశారు. పండుగల సమయంలో వ్యక్తిగత ఆనందంతో పాటు సామాజిక బాధ్యత కూడా గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఏడాదిలోని 364 రోజుల పాటు వాహనాలు, పరిశ్రమల వల్ల కాలుష్యం ఉంటోందని, దాని గురించి ప్రత్యేకంగా మాట్లాడి ప్రయోజనం లేదని అభిప్రాయపడిన ఆమె, టపాసుల విషయంలో ఇతరులకు కలిగే ఇబ్బందులను గుర్తించడం ముఖ్యమని వెల్లడించారు.

అలా జరగడం కూడా మంచిదే..



ఎన్నో పాఠాలు నేర్చుకున్నా: సమంత!

హైదరాబాద్, నవంబర్ 10 :: జీవితంలో పొందే విజయాల కంటే ఎదురయ్యే అపజయాలే అత్యధిక పాఠాలు నేర్పిస్తాయని ప్రముఖ కథానాయిక సమంత వ్యాఖ్యానించారు. తాజాగా ఓ ప్రత్యేక షోలో పాల్గొన్న ఆమె, వ్యాపార రంగంలో తనకు ఎదురైన తొలి వైఫల్యాలను, అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఆ ఓటమి తనకు ఎన్నో నేర్పిందని చెప్పారు. "నా తొలి వ్యాపార భాగస్వామ్యం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయితే, మొదటిసారి పెట్టుబడి పెట్టిన వ్యాపారం విఫలమవడం కూడా మంచిదే. ఎందుకంటే, విజయాల కంటే అపజయాలే ఎక్కువ నేర్పిస్తాయి. నా జీవితంలో నేర్చుకున్న పాఠాలన్నీ వైఫల్యాల నుంచి వచ్చినవే. విజయాలు నాకు పెద్దగా ఏమీ నేర్పించలేదు" అని సమంత స్పష్టం చేశారు. ఇదే వేదికపై వ్యాపార రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న విభిన్న సవాళ్లపైనా ఆమె మాట్లాడారు. "కొత్తగా ఏదైనా ప్రారంభించాలంటే మహిళల్లో భయం ఎక్కువగా ఉంటుంది. మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడం నాకు ఎంతో కొత్త అనుభూతినిచ్చింది. ఇప్పటివరకు నేను దాదాపు 8 నుంచి 10 వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు పెట్టాను. వాటిలో ఎనిమిది సంస్థలకు మహిళలే వ్యవస్థాపకులుగా ఉండడం ఎంతో సంతోషకరమైన విషయం" అని తెలిపారు. కాగా, త్వరలో తొలి బిడ్డకు జన్మనివ్వనున్న సమంత, ప్రస్తుతం 'సెలబ్రిటీ మాస్టర్‌షెఫ్ తమిళం' షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

ఒకే ఏడాదిలో 3 సినిమాలు హిట్.. సూర్య రికార్డు



ఓ అగ్ర కథానాయకుడు ఒకే ఏడాదిలో మూడు సినిమాల్లో నటించడం, ఆ మూడూ హిట్ కావడమంటే విశేషమే కదా. ప్రముఖ నటుడు సూర్యకు అలాంటి ఘనతే దక్కబోతోంది. ఒకే ఏడాదిలో రూ.200 కోట్లు వసూలు చేసిన మూడు చిత్రాల్లో నటించిన తమిళ హీరోగా అతిత్వరలో ఆయన రికార్డు సృష్టించబోతున్నారు. ఈ ఏడాది మే నెలలో సూర్య నటించిన కరుప్పు (వీరభద్రుడు), ఆగస్టులో విశ్వనాథ్ అండ్ సన్స్ విడదల కాగా, దీపావళి కానుకగా సీన్ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. కరుప్పు, విశ్వనాథ్ అండ్ సన్స్ సూపర్ హిట్ చిత్రాలుగా నిలవగా, సీన్ కూడా ప్రేక్షకాదరణతో మంచి వసూళ్లు రాబట్టుతోంది. కరుప్పు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.310 కోట్లు వసూలు చేయగా, విశ్వనాథ్ అండ్ సన్స్‌కు రూ.209 కోట్లు వచ్చాయి. 'సీన్' ఇప్పటివరకూ రూ.154 కోట్లు సాధించింది. ప్రస్తుతం ఆ చిత్రానికి వస్తున్న స్పందనను చూస్తే, ఈ వారాంతానికి రూ.200 కోట్లు వసూలు చేయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అంటే త్వరలోనే ఆయనకు ఈ ఏడాదిలో రూ.200 కోట్లు వసూళ్లు అందించిన మూడో చిత్రంగా 'సీన్' నిలవబోతోంది.

త్వరలో పెళ్లిపీటలెక్కనున్న ఇరుముడి హీరోయిన్

చెన్నై, నవంబర్ 10 :: తమిళ చిత్ర పరిశ్రమలో 'ఇరుముడి' సహా పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక ప్రియా భవానీ శంకర్ త్వరలోనే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతోంది. గత కొన్నేళ్లుగా తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌తో గాఢమైన ప్రేమలో ఉన్న ఈ భామ, త్వరలోనే అతడితో ఏడడుగులు వేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రియా తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన కొన్ని ప్రత్యేకమైన ఫోటోలు ఈ పెళ్లి వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. దీంతో అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా ఈ జంటకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ప్రియా భవానీ శంకర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో కొన్ని ప్రత్యేక ఫోటోలను అభిమానులతో పంచుకున్నారు. ఆ ఫోటోల్లో ఆమె సాంప్రదాయ దుస్తుల్లో ఎంతో ముచ్చటగా కనిపించడమే కాకుండా, మెడలో మల్లెపూల దండలు ధరించి కనిపించారు. అంతేకాకుండా చేతులకు అందంగా గోరింటాకు పెట్టుకున్న దృశ్యాలను కూడా షేర్ చేశారు. ఈ ఫోటోలు చూస్తుంటే ఆమె ఇంట్లో పెళ్లి వేడుకలకు సంబంధించిన ముందస్తు సందడి మొదలైనట్లు అభిమానులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుకలు ప్రారంభమైనట్లు సమాచారం. అయితే ఇవి అధికారికంగా ప్రీ వెడ్డింగ్ వేడుకల ఫోటోలేనా లేదా పెళ్లి తేదీ ఎప్పుడు అనే అంశాలపై ప్రియా భవానీ శంకర్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రియా భవానీ శంకర్, రాజ్‌వెల్ రాజ్ ప్రేమకథ విషయానికి వస్తే వీరిద్దరికీ కాలేజీ రోజుల నుంచే గాఢమైన పరిచయం ఉంది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో అప్పటి నుంచి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ తమ బంధాన్ని కొనసాగిస్తున్నారు. దాదాపు పదేళ్లకు పైగా ప్రేమ ప్రయాణం సాగిస్తున్న ఈ జంట, తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను ఎక్కువగా గోప్యంగానే ఉంచుతూ వచ్చారు. 2022లోనే ఈ జంట కలిసి తమ కలల ఇంటిని కొనుగోలు చేయడం అప్పట్లో చిత్రసీమలో చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి వీరి పెళ్లి ఎప్పుడు జరుగుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వినిపిస్తున్న కథనాల ప్రకారం, ప్రియా భవానీ శంకర్ తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌ను కుటుంబ సభ్యులు, అత్యంత ఆత్మీయుల సమక్షంలో వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారట. ఎలాంటి భారీ హంగామా లేకుండా, అత్యంత సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుకను నిర్వహించేందుకు ఇరు కుటుంబాలు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పెళ్లి తేదీ, వివాహ వేదికకు సంబంధించిన వివరాలను ఈ జంట అధికారికంగా ప్రకటించలేదు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com